నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
గురువారం | 28 నవంబర్ 2024 | www.navatelangana.com

చెరువులు, కుంటలను కాపాడటమే హైడ్రా లక్ష్యం



నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని మేళ్లచెరువు, ఉస్మాన్ నగర్ లోని చెలికుంట చెరువులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం సందర్శించారు. మేళ్ల చెరువు కబ్జాకు గురవుతుందని కొందరు స్థానికులు హైడ్రా దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన.. వెంటనే చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా కబ్జాకు గురైన చెరువులను కాపాడతామని రంగనాథ్ తెలిపారు. చెరువు పరిధిని పూర్తి సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించి చర్యలు తీసుకుంటామన్నారు. చెరువులు, కుంటలని కాపాడడమే హైడ్రా ధ్యేయమని స్పష్టం చేశారు.

మహర్షి భగీరథుడి విగ్రహా ఆవిష్కరణ

రూ.3.50 లక్షల సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్..



నవతెలంగాణ-గుమ్మడిదల

మండల పరిధిలోని దోమడుగు గ్రామంలో రూ.3.50లక్షల నిధులతో ఏర్పాటు చేసిన మహర్షి భగీరథుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మండల మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భగీరథ మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో గర్వించదగిన విషయమన్నారు. విగ్రహ దాత ఎమ్మెల్యే జీఎంఆర్‌ను స్థానికులు శాలువా, పూలమాలల్లతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ అభిషేట్టి రాజశేఖర్, నారాయణ, ఎండి హుస్సేన్, శేఖర్ సాగర్, మురళీకృష్ణ సాగర్, పెద్ద అంజనేయులు సాగర్, గ్రామస్తులు తదితరులున్నారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా లక్ష్మయ్య యాదవ్



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మర్పల్లి లక్ష్మయ్య యాదవ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన టీపీటీఎఫ్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. లక్ష్మయ్య యాదవ్ ఎన్నిక పట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, జిల్లా ఉపాధ్యక్షులు విజయ భాస్కర్, మర్రి ప్రశాంతి, మల్లికార్జున్, జిల్లా కార్యదర్శి అశోక్ కుమార్, జగన్నాథం, కిష్టయ్య, పుండరీకం, రవికుమార్, కొండాపూర్ ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, సదాశివపేట అధ్యక్షులు శివశంకర్‌లు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లక్ష్మయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

క్రషర్లతో కష్టాలు.. రైతులకు నష్టాలు



నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని రాళ్లకత్వ గ్రామంలో గల క్రషర్ల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. పంటలు దెబ్బతిని తీవ్రం గా నష్టపోతున్నామని గ్రామస్తులు తహసీల్దార్ బిక్షపతికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ క్రమంలోనే సీఐ, ఎస్సైలను కలిసి వివరించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ యువ నేతలు రామకృష్ణ, శివనగర్ ఆమీర్ హుస్సేన్,ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, దళితరత్న డాక్టర్ ఏర్పుల శ్రీనివాస్, ఎస్సీ ఆర్‌పిఎస్ పటాన్‌చెరు తాలూకా కన్వీనర్ కొనింటి మహేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిని తొలగించాలని ఎంపీడీఓకు వినతి



నవతెలంగాణ-ఝరాసంగం

మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిని విధుల నుండి తొలగించాలని ఎంపీడీకు గ్రామ స్తులు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో వీధిలైట్లు, మురుగు కాలువలు వంటి సమస్యలను పరిష్కరించడం లేదని, గ్రామానికి అసలే రావడం లేదని వినతిలో పేర్కొన్నారు. పలుమార్లు అధికారులకు తొలగించాలని విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని కోరా రు. వినతిపత్రం అందించిన వారిలో సంగంకే, తుమ్మన్‌పల్లి గ్రామస్తులు ఉన్నారు.

ఎంపీ డిస్టలరీ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-చౌటకూర్

చౌటకూర్ గ్రామ శివారులోని ఎంపీ డిస్లరీ పరిశ్రమ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా పిసిబి కంట్రోల్ కార్యాలయం అధికారి గీత సఫారీకి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. పరిశ్రమ కాలుష్యాన్ని వదలడంతో సరాపల్లి చుట్టుపక్కల గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. పరిశ్రమ నుంచి పొగతో కూడిన డస్టు పడడంతో విపరీతమైన ఎలర్జీ, రోగాల బారిన పడుతున్నారన్నారు. పంటలు వేసినా కాలుష్యం ద్వారా పంట దిగుబడి రావడం లేదని వెంటనే దీనిని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సరాపల్లి గ్రామ డీవైఎఫ్ఐ నాయకులు ఎన్ గోవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-గుమ్మడిదల

కార్తీకమాసన్ని పురస్కరించుకొని కళ్యాణం వెంకటేశ్వర స్వామి ఆలయంలో సాలగ్రామ పూజలు బుధవారం సామూహిక పూజలు నిర్వహించారు. ఆలయ వంశపారంకులు కె.వి నరసింహచార్యులు రంగనాథచార్యుల ఆధ్వర్యంలో ఈ కుంకుమార్చన పూజలు జరిగాయి.

యోగ ద్వారా మానసిక, శారీరక రుగ్మతలు తొలగిపోతాయి



నవతెలంగాణ-వెల్దుర్తి

యోగా ద్వారా మానసిక, శారీరక రుగ్మతలు తొలగిపోతాయని అష్టంగా యోగ గురువు వికోటి కళింగరాజు ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం మండల కేంద్రంలో వెంకటేశ్వర దేవాలయ ప్రాంగణంలో వారం రోజులపాటు యోగాభ్యాసం చేసిన అష్టంగా యోగ సభ్యులు ప్రధాన వీధుల గుండా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. యోగ గురువు వికోటి కళింగరాజు మాట్లాడారు. ప్రతిరోజు గంట పాటు యోగాసనాలు చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని ప్రజలకు అవగాహన కల్పించారు. నిరంతరం యోగా ద్వారా ఆరోగ్యం ఆయుష కూడా పెంచుకోవచ్చున్నారు. అలనాటి ఋషులు యోగి పుంగవులు యోగాసనాల ద్వారానే ఏకాగ్రత దీర్ఘాయుష్షును పొందారని తెలిపారు. మానవ శరీరంలోని వివిధ భాగాలను మనమే శుద్ధి చేసుకుని మన దినచర్యలో తీసుకునే ఆహార నియమాలతోటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- విరివిగా విరాళాలు ఇవ్వండి
- పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



నవతెలంగాణ-సంగారెడ్డి

జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో 'ఇంటింటికి సీపీఐ(ఎం)' పేరుతో ప్రజల వద్ద నుంచి బుధవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను మొదటిసారి సంగారెడ్డిలో జరగనున్నాయన్నారు. మహాసభలను విజయవంతం చేయడం కోసం సంగారెడ్డి జిల్లా ప్రజానీకం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిత్యం పెరుగుతున్న నిత్యావసర ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగూర్ జలా లు తాగుకు, సాగుకు జిల్లాకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగూరు జలాల సాధన కోసం సీపీఐ(ఎం) పోరాటం చేసిందన్నారు. సంగారెడ్డి జిల్లాలో సింగూరు. జలాలు సాగుకు ఇవ్వకపోవడం వలన వలసలు పెరి గాయన్నారు. పత్తికి మద్దతు ధర ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వడ్ల కొనుగోలు వెంటనే ప్రారంభించాలన్నారు. మండలంలో అసైన్మెంట్ భూములకు పట్టా సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదల ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాల న్నా రు. గ్రామాలకు వెళ్లే రోడ్లను వెంటనే మరమ్మతులు చేయా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు ఎం. నరసింలు, నాయకులు అశోక్, మహేష్, రమేష్ గౌడ్,సాయిలు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పట్న హైవే హోటల్ భోజనంలో ఈగలు

- అడ్వకేట్లకు చేదు అనుభవం
- ఆర్డర్ ఇచ్చిన పప్పులో ఈగలు..
- ఇదేమని అడగగా నిర్వాహకుల నిర్లక్ష్య సమాధానం
- ఫోన్ ద్వారా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరుకు చెందిన అడ్వకేట్స్ పాశం వినోద్‌రెడ్డి, లక్ష్మణ్, మోసిస్‌లు బుధవారం మధ్యాహ్నం సంగారెడ్డి నుంచి వస్తూ రుద్రారం శివారులో గల 'పట్న హైవే హోటల్‌లో భోజనం చేసేందుకు వెళ్లారు. అయితే సర్వర్ తీసుకు వచ్చిన భోజనంలోని పప్పులో ఈగలు రావడంతో వారు ఒక్కసారిగా అవాక్కయ్యారు.ఇదేమని నిర్వాహకులను అడ గ్గా.. వారు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దాంతో వారు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు వాట్స్‌అప్ ద్వారా ఫోటోలు పంపించి ఫిర్యాదు చేశారు. ఆకలితో భోజనం చేద్దామని హోటల్‌కు వస్తే పారిశుధ్య లోపంతో నిర్వాహకులు మనుషుల ప్రాణా లతో చెలగాటమాడుతున్నారని.. అధికారులు తరచూ తనిఖీ లు చేయకపోవటం వల్లే హోటల్లో ఇలాంటివి జరుగు తున్నాయని న్యాయవాది వినోద్‌రెడ్డి అన్నారు. ఇలాంటి హోటల్స్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పత్తికి క్వింటాకు రూ.10 వేల మద్దతు ధర ఇవ్వాలి

మధ్య దళారుల బెడదను అరికట్టాలి

సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నర్సిములు డిమాండ్



నవతెలంగాణ-కొండాపూర్

పత్తికి క్వింటాకు పదివేల రూపాయల మద్దతు ధర చెల్లించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. నర్సిములు డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామా ల్లో సీపీఐ(ఎం) బృందం మంగళవారం పర్యటించింది. ఈ పర్యటన సందర్భంగా పత్తి రైతుల ఎన్నో సమస్యలు తమ దృష్టికి వచ్చినట్టు నర్సిములు తెలిపారు. విత్తనాలు, పురుగు మందులు ఉద్దెర ఇస్తున్నామని చెప్పి.. రైతుల నుంచి తక్కువ ధరకే పత్తిని కొంటున్న మధ్య దళారుల పై ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. వారి లైసెన్సులను రద్దు చేయాలన్నారు.సీసీఐ క్వింటా పత్తికి రూ.7400 ఇస్తు న్నదని ప్రభుత్వాలు గొప్పలు చెప్పడమే తప్పా.. ఎక్కడా అలా కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో మధ్య దళారులు రూ.6,500 నుంచి రూ.6700 వరకే పత్తిని కొంటున్నారన్నారు. వారిపై ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుని క్వింటాకు రూ.10000 మద్దతు ధరతో కొనాలన్నారు. విచ్చలవిడిగా గ్రామాలలో మధ్యదళారులు తక్కువ రేటుకు పత్తిని కొంటుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం చెప్పిన రేటుకే సీసీఐ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని.. లేని ఎడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో మండల కార్యదర్శి కే.రాజయ్య మండల కమిటీ సభ్యులు బాబురావు,పుల్లయ్య, కిషన్, పెద్దాపురం రాజు, మానేయ్య,అనంతరావు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి





జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

నవతెలంగాణ-సంగారెడ్డి

ట్రాన్స్‌జెండర్లు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్ తెలిపారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని న్యాయసేవా సదన్‌లో ట్రాన్స్‌జెండర్లలకు బుధవారం ప్రత్యేక న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సదస్సులో రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ట్రాన్స్‌జెండర్లు అందరు చట్టలపై అవగాహన కలిగి ఉండాలని, క్రమశిక్షణగా ఉండాలని తెలిపారు. న్యాయ వ్యవస్థలో ఎలా ఉండాలో రమేశ్ వివరించారు.

గీతంకు ఐటీసీ ప్రశంసా..

పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రశంసా పత్రం



నవతెలంగాణ-పటాన్‌చెరు

'చెత్త నుంచి సంపద 'పేరిట' గీతం డీమ్డ్ విశ్వవి ద్యాలయం హైదరాబాద్ చేపట్టిన పర్యావరణహిత చర్యల ను ప్రశంసిస్తూ ప్రముఖ బహుళజాతి కంపెనీ ఐటీసీ లిమి టెడ్ ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని అందజేసింది. గీతంలో వినియోగించిన (వృథా) కాగితం, పుస్తకాలను ఒకచోట చేర్చి, వాటిని పునర్వినియోగం కోసం ప్రతియేటా ఐటీసీకి పంపడం ఆనవాయితీగా వస్తోంది. అలా 2023-24లో 9,380 కిలోల కాగితపు వ్యర్థాలను పునర్వినియోగం కోసం పంపగా, తద్వారా ఏడు క్యూబిక్ మీటర్ల పల్లపు స్థలం, 65,525 కిలోల నీరు, 37,443 యూనిట్ల విద్యుత్, 11 మీటర్ల కర్బన ఉద్గారాలు (కార్బన్ డై ఆక్సైడ్) తగ్గడానికి గీతం సహకరించినట్టు ఆ ప్రశంసా పత్రంలో పేర్కొ న్నారు.ఈ అవార్డును ఐటీసీ లిమిటెడ్ పేపర్ బోర్డ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (హెచ్ఆర్ అండ్ సీఎస్ఆర్) సిబ్ శంకర్ బందోపాధ్యాయ, ఎంఏఆర్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.మురళి స్వయంగా సంతకం చేసి ఇవ్వడం విశేషం. స్థిరమైన వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్ధతులను ప్రోత్సహిం చడంలో గీతం చురుకైన పాత్రను గుర్తించడం తమకు గర్వకారణమని బందోపాధ్యాయ వ్యాఖ్యానించారు. రీసైక్లింగ్ (పునర్ వినియోగం), పర్యావరణ పరిరక్షణ పట్ల గీతం అంకితభావం ఐటీసీ వావ్ యొక్క స్ఫూర్తికి ఉదాహరణగా నిలుస్తోందని, ఇది దేశాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంగా మార్చడానికి దశాబ్ద కాలం తాము చేస్తున్న కృషికి ఊతమిస్తోందన్నారు. ఐటీసీ వావ్ అనేది వ్యర్థాలు ఉత్పత్తయ్యే చోటే వాటిని తడి, పొడిచెత్తగా విభజించి, పునర్ వినియోగం, పునరుద్ధరణ ద్వారా ఘన వ్యర్థాలను నిర్వహిం చడం లక్ష్యంగా పెట్టుకున్న ఒక మార్గదర్శక కార్యక్ర మంగా బందోపాధ్యాయ వివరించారు. దాదాపు దశాబ్ద కాలంగా ఐటీసీ గ్రూపు బెంగళూరు, మైసూరు, హైదరా బాదు, కోయంబత్తూర్, చెన్నై, ఢిల్లీతో సహా ప్రధాన నగరాల్లో సుస్థిరత కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోం దని, దాదాపుగా యేడాదికి 64 వేల మెట్రిక్ టన్నుల పొడి వ్యర్థా లను సేకరిస్తోందన్నారు.తద్వారా 17,750 మందికి పైగా వ్యర్థ పదార్థాల నిర్వహణదారులకు స్థిరమైన జీవనో పాధిని కల్పిస్తోందని, 57 లక్షల మంది బడికెళ్లే బాలల్లో దీనిపై చైత న్యం తీసుకొచ్చామని, దాదాపుగా 2.2 కోట్ల మంది పౌరులు వ్యర్థాల నిర్వహణలో స్థిరమైన పద్ధతులను అవలంబిస్తు న్నట్టు బందోపాధ్యాయ పేర్కొన్నారు. ఈ చొరవ పచ్చదనం, పరిశుభ్రమైన భవిష్యత్తు కోసమేనని ఆయన స్పష్టీకరించారు.

కర్కపట్లలో ..
రూ.1.33 కోట్ల విలువ చేసే డ్రగ్స్ పట్టివేత



నవతెలంగాణ-మర్కుక్

తెలంగాణలోని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ రూ.కోటి విలువైన యాంటీబయాటిక్స్ మందులను గుర్తించి స్వాధీనం చేసుకుంది. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని కర్కపట్ల గ్రామంలోని జోడాస్ ఎక్స్‌పోయిమ్ ప్రైవేట్ లిమిటెడ్ తయారీ కేంద్రం నుంచి రూ.1.33 కోట్ల మందులను బుధవారం తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లిమిటెడ్, బయోటెక్ పార్క్, ఇతర ఫార్మాస్యూటికల్ కంపెనీలు తయారు చేసిన ఉత్పత్తులను రష్యాకు వారి కంపెనీ తప్పుగా ఎగుమతి చేసినందుకు, యాంటీబయాటిక్స్‌ను అనధికారికంగా ప్యాకింగ్ చేసినందుకు అధికారులు సీజ్ చేశారు. డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు జోడాస్ ఎక్స్‌పాయ్మ్ ప్రైవేట్ లిమిటెడ్ తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫెసిలిటీ యొక్క ఫినిష్డ్ గూడ్స్ వేర్‌హౌస్‌లో భారీ యాంటీబయాటిక్స్ నిల్వలను గుర్తించినట్లు తెలిపారు. 1940. చట్టం ప్రకారం ధృవీకరణ తర్వాత, యాంటీబయాటిక్ యాంపిసిలిన్+ సల్బాక్టమ్ 1000ఎంజీ+500ఎంజీ ఇంజెక్షన్లు, వైల్స్‌తో కూడిన పరిమాణాన్ని జోడాస్ ఎక్స్‌పాయ్మ్ ప్రైవేట్ లిమిటెడ్ తయారు చేసినట్లు తప్పుగా లేబుల్ వేశారన్నారు. లిమిటెడ్ ఇండియా, అల్ప లబోర్టోరీస్ లిమిటెడ్., 33/2, ఏ.బీ రోడ్, పిగ్డాంబర్, ఇండోర్, ఎంపీ 453446, నంబర్ భారతదేశానికి చెప్పిన బ్యాచ్ వాస్తవానికి దగ్గరగా ఉందన్నారు. ఇండియన్ గేనోమిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో తయారు చేయబడిందని. లిమిటెడ్, ప్లాట్ నెం. 135/1 అండ్ 135/2, ఫేజ్-2 చెర్లపల్లి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, తెలంగాణ. ఈ బ్యాచ్‌ను జోడాస్ ఎక్స్‌పాయిమ్ ప్రైవేట్ లిమిటెడ్ తయారు చేసిందని తప్పుడు వాదనలతో రష్యాకు ఎగుమతి చేస్తున్నారని తెలిపారు. క్లావులానిక్ యాసిడ్ 200ఎంజీ, అంపిసిల్లిన్, సుల్బక్టం 2000ఎంజీ+1000ఎంజీ, మీరోపేనేం 500 ఎంజీ అనే కొన్ని ఇతర యాంటీబయాటిక్స్ స్టాక్‌లను అక్టోబర్, నవంబర్ 2024లో రష్యాకు ఎగుమతి చేసినట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. ఫార్మాస్యూటికల్ కంపెనీల పేరుతో తప్పుడు ఎగుమతి చేశారన్నారు. జోడాస్ ఎక్స్‌పోయిమ్ ప్రైవేట్ లిమిటెడ్ లిమిటెడ్ ఇండియన్ గేనోమిక్స్‌లో తయారు చేయబడిందని, లిమిటెడ్, ప్లాట్ నెం. 135/1 అండ్135/2, ఫేజ్-2 చెర్లపల్లి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, తెలంగాణ చిరునామాతో ఈ బ్యాచ్‌ను జోడాస్ ఎక్స్‌పాయిమ్ ప్రైవేట్ లిమిటెడ్ తయారు చేసిందని తప్పుడు వాదనలతో రష్యాకు ఎగుమతి చేస్తున్నారని తెలిపారు. కర్కపట్ల గ్రామంలోని జోడాస్ ఎక్స్‌పోయిమ్ ప్రై. లిమిటెడ్ అనధికారికంగా యాంటీబయాటిక్స్ ప్యాకింగ్ చేసినట్లు గుర్తించామన్నారు. వాస్తవానికి ఇండియన్ జెనోమిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తయారు చేయబడిందని లిమిటెడ్, ప్లాట్ నెం. 135/1 అండ్ 135/2, ఫేజ్-2 చెర్లపల్లి, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా, తెలంగాణ చిరునామాతో జాజెన్ ఫార్మా ప్రై. లిమిటెడ్ ప్లాట్ నెం.7, 8, ఉత్పత్తిపై ఆ కంపెనీ తప్పుడు దావా వేశారన్నారు. దీనికి సంబంధించిన ఇంకా కొన్ని మందులను ఫార్మా నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో రూ.కోటి విలువైన యాంటీబయాటిక్స్ నిల్వలు ఉన్నాయని డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం, 1940 నిబంధనలకు విరుద్ధంగా రూ.1.33 కోట్లు డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. డైరెక్టర్ జనరల్ ఐపీఎస్ వి, బీ కమలహాసన్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ పి.రాము, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. వినయ్ సుష్మి కార్తీక్, శివ, చైతన్య, టి. శివ తేజ, పి.చంద్రకళ డ్రగ్ సిబ్బంది, తదితలున్నారు.

అనారోగ్యం, కుటుంబ సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్య



నవతెలంగాణ- రాయపోల్

కుష్టు వ్యాధితో బాధపడుతూ అనారోగ్య సమస్యలు వెంటాడుతుండగా కుటుంబ గొడవలు సమస్యలతో సతమతమవుతూ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. దౌల్తాబాద్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భీమయ్యగారి కిష్టయ్య(లచ్చయ్య) (61) వ్యవసాయం కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. కిష్టయ్య- సువర్ణ దంపతులకు ముగ్గురు కూతుర్లు సంతానం ఉండగా ముగ్గురి వివాహాలు చేశారు. రెండో కూతురు రజిత భర్త నుంచి విడిపోయి ఏడు సంవత్సరాల నుంచి ఇంట్లోనే ఉంటుంది. తరచూ కూతురు కాపురం విషయంలో కుటుంబ సమస్యలు, తన కుష్టు వ్యాధితో బాధపడుతుండగా అనారోగ్య సమస్యలతో భార్య కూతుర్లతో గొడవ పడుతుండేవాడు. మంగళవారం సాయంత్రం ఎన్ని రోజులకైనా కుష్ఠి వ్యాధి నయంకావడం లేదని, కూతురు కాపురం సరిదిద్దడం లేదని జీవితం మీద విరక్తి చెంది ఎవరు చూడని సమయంలో ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు పరిశీ లించేసరికి కిష్టయ్య మృతి చెందాడు. పోలీసు లకు సమాచారం అందించడంతో మృతి దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నట్లు దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ తెలిపారు.

108 సంస్థలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కల్హేర్

108 ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో (ఈఎంటి) ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, పైలట్ (డ్రైవర్)పోస్టుల ఉద్యోగ నియామకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు 108 సంస్థ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్(పీఎం)జనార్ధన్ సంగారెడ్డి జిల్లా (ఈఎంఈ) ఎమర్జెన్సీ మెడికల్ ఎడ్యుకేషనల్ షేక్ శాలి హుస్సేన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హత కలిగిన అభ్య ర్థుల నుండి దరఖాస్తులు కోరుతూ అదే రోజు ఇంటర్వ్యూలు సైతం నిర్వహి స్తున్నట్టు చెప్పారు. బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ లైఫ్ సైన్స్, జీఎన్‌ఎం, బీఎస్సీ, ఎంఎల్‌టి, డిఎంఎల్ టి, బి ఫార్మసీ, విద్యా అర్హతలు ఉండి 20 నుంచి 35 ఏండ్ల లోపు వయస్సు గల వానే అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు రేపు(శుక్రవారం) ఉదయం 10 గంటల వరకు సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల 108 ఆఫీసులో దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం అభ్యర్థులకు సంగారెడ్డి జిల్లా 108 ఆఫీస్ కార్యాలయంలో పీఎం ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాల కోసం 7569026145ను సంప్రదించాలన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-కొండాపూర్



మండల కేంద్రంలోని సంక్షేమ హాస్టల్లో మధ్యాహ్న భోజనాన్ని ఉప తహసీల్దార్ మర్రి ప్రదీప్, ఎంపీడీవో శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థుల కోసం ఆహార పదార్థాలను తయారు చేయాలన్నారు. వండిన ఆహార పదార్థాలపై తప్పనిసరిగా మూతలు పెట్టి ఉంచాలన్నారు. ఆహార పదార్థాలు తాజా వాటిని కొనుగోలు చేయాలన్నారు. వర్షాకాలంలో పరిశుభ్రతను పాటించాలని, పిల్లలకు శుభ్రమైన ఆహారాన్ని రుచికరంగా అందించాలన్నారు. విద్యార్థులు కూడా చేతులు శుభ్రంగా కడుక్కున్న తర్వాతే భోజనాలు చేయాలని సూచించారు. విద్యార్థుల కోసం వండి సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న నరోత్తం

నవతెలంగాణ-జహీరాబాద్

ఝరాసంఘం మండలం కప్పాడ్ గ్రామానికి చెందిన బక్క రవికుమార్ కుమార్తె వివాహ వేడుక జహీరాబాద్ పట్టణంలోని శుభం గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగింది. ఈ వేడుకలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం పాల్గొని నూతన వదువరులను ఆశీర్వదించారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు సిద్ధన్న పాటిల్,మల్లన్న పాటిల్, చెంగల్ జైపాల్,దిలీప్ తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ కార్యాలయాలకు స్థల పరిశీలన

నవతెలంగాణ-చౌటకూర్

మండల కార్యాలయాలు చౌటకూర్ గ్రామంలోనే నిర్మించాలని గ్రామస్తులు ఇచ్చిన వినతిపత్రంతో స్పందించిన తహసీల్దార్ కిరణ్‌కుమార్.. చౌటకూర్ గ్రామంలో బుధవారం స్థల పరిశీలన చేపట్టారు. ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నయో గ్రామ ప్రజలతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు.. కార్యాలయాలు వేరే గ్రామంలో నిర్వహించకుండా చూడాలని, జిల్లా అధికారుల దృష్టికి, జిల్లా మంత్రిదృష్టికి కూడా తీసుకువెళ్లాలని తహసీల్దార్‌ను కోరారు.



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రాకేష్ షేట్కార్

నవతెలంగాణ-మనూర్

మండల కేంద్రానికి చెందిన అంజిరెడ్డి మనుమడి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షేట్కార్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు శివకాంత్ పటేల్, మాజీ ఎంపీటీసీ సిద్ధారెడ్డి, సంగమేష్ పటేల్, మహాలింగ్ పటేల్, పండు చారి, సతీష్ కాలేద్, నందు తదితరులు ఉన్నారు.

అనుమానాస్పందంగా యువకుడి మృతి



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని కొడకంచి గ్రామంలో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందారు. సబ్ ఇన్‌స్పెక్టర్ నాగలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. కంచనపల్లి మహేష్ (27) అనే యువకుడు మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కాగా అతడు అనుమానాస్ప దంగా శవమై కనిపించాడు. మృతదేహానికిపటాన్చెరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి.. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. మృతుడి సోదరుడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన ఏఈ రాజేశ్వర్ చారి

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండల విద్యుత్ అసిస్టెంట్ ఏఈగా రాజేశ్వర్ చారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జహీరాబాద్ విద్యుత్ కార్యాలయం నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అలాగే విద్యుత్ వినియోగదారులు కూడా విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలన్నారు.



వివాహ వేడుకలకు హాజరైన కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రామతీర్థం గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త దత్తు వివాహ వేడుక బుధవారం జరిగింది. ఈ వేడుకకు కాంగ్రెస్ పార్టీ మండల నేతలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ నేతలను పలువురు శాలువాతో సన్మానించారు. ఈ వేడుకకు హాజరైన వారిలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు కొత్తపల్లి భాస్కర్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి గుంజేటి చంద్రప్ప, డీలర్ సంగన్న, సందీప్, గుంజేటి రవి పటేల్, ముఖీమ్, రాజు, మారుతి పటేల్, జగప్ప తదితరులున్నారు.



జిన్నారంలో కళాయాత్ర ప్రదర్శనలు

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో పల్లె పల్లెకు ప్రజాపాలన విజయోత్సవాల పై 'కళాయాత్ర' ప్రదర్శన కార్యక్రమాలను కళాకారులు బుధవారం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమ పథకాల పై కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆయిదాల సునీల్, డి రమేష్, ఎన్ దుర్గేష్, ఎస్ మల్లేష్, పి సంధ్య ఈ వినేష్, బి నవీన్ జి శంకర్ పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్య కరదీపిక విడుదల చేసిన కలెక్టర్

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమంపై ప్రాథమిక ఆరోగ్య వైద్య అధికారులకు సంబంధించిన కరదీపికను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి బుధవారం విడుదల చేశారు. ఇందులో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన కుటుంబ సంక్షేమం, జాతీయ ఆరోగ్య మిషన్, జనని సురక్ష యోజన ,పాఠశాల విద్యార్థుల ఆరోగ్య సేవలు, ఆహారం ఆరోగ్యం, హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి నిరోధక కార్యక్రమాలు, ఊపిరితిత్తుల వ్యాధులకు, చిన్నపిల్లలు చిన్నపిల్లల వ్యాధులకు సంబంధించిన, పరిసరాల పరిశుభ్రత, ఉదరకోశ వ్యాధులు, కీటకాల ద్వారా వ్యాపించు వ్యాధులు, రేబిస్ వ్యాధి ,క్యాన్సర్, దంతవ్యాధులు, ప్రథమ చికిత్స, యోగ మొదలైనవి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి. గాయత్రి దేవి, డాక్టర్ శశాంక్, ఎం.ప్రసాద్ డెమో ,రవి, శశి ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాల పట్ల బాల్యం నుంచే అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-జహీరాబాద్

చట్టాల పట్ల బాల్యం నుంచే అవగాహన కల్పించుకోవడం ఎంతో అవసరమని న్యాయవాది రాఘవేంద్ర నాయక్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ ఆధ్వర్యంలో రంజోల్ గురుకుల కళాశాలలో బుధవారం 'బచ్‌పన్ బచావో' కార్యక్రమాన్ని ప్యానెల్ అడ్వకేట్ రుద్రయ్య స్వామి, న్యాయవాది రాఘవేంద్రనాయక్ సంయుక్తంగా నిర్వహించారు. బాల్య వివాహ నిరోధక చట్టం, సైబర్ క్రైం గురించి విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహ బాధితులు, బాల కార్మికులు ఎక్కడైనా ఉన్నట్లు గుర్తిస్తే స్థానిక తహసీల్దార్ లేదా పోలీస్ అధికారికి లేదా మండల లీగల్ సర్వీసెస్ కార్యాలయంలో గాని లేదా 1098కి ఫోన్ ద్వారా తెలుపవచ్చని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. బాల్య వివాహ నిరోధకతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సృజన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా కల్లు దుకాణాలు

- రోడ్లపైనే వాహనాల పార్కింగ్..
- తొలగించాలని అడిగితే దాడులు!
- పలుగు పోచమ్మ ఆలయం వద్ద మందుబాబుల వికృతి చేష్టలు
- విసిగిపోతున్న సందర్శకులు..



నవతెలంగాణ-హత్నూర

సందర్శకులతో నిత్యం కిటకిటలాడే పలుగు పోచమ్మ ఆలయం వద్ద విచ్చలవిడిగా కల్లు దుకాణాలు ఏర్పాటయ్యాయి. దాంతో ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా భారీ షెడ్లు వేసి కల్లుతో పాటు మద్యం అమ్మడం.. అలాగే రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్ చేయడంతో ఆలయానికి వచ్చే భక్తులు నానా అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా మందుబాబుల వికృత చేష్టలతో భక్తులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్ని కావు. మందుబాబులు రోడ్డుపైనే కార్లు పార్కింగ్ చేస్తున్నారని.. పక్కకు తీయాలంటే దాడులు సైతం చేస్తున్నారని సందర్శకులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి సంఘటనతో ఆర్టీసీ బస్సులు అటువైపు నుంచి నడపడం కూడాబంద్ చేశారని స్థానికులు చెబుతున్నారు. ఎక్సైజ్ ఆఫీసర్లు తక్షణమే స్పందించి కల్లు దుకాణాలను తొలగించాలని ఆలయ ప్రతిష్టను దెబ్బతీయకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐని ఫోనులో వివరణ కోసం సంప్రదించడానికి ప్రయత్నిస్తే స్పందించలేదు.

ఇస్నాపూర్ వరకు మెట్రో రైలు పొడిగించాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఇస్నాపూర్ వరకు మెట్రో రైలు పొడిగించాలని సీపీఐ(ఎం) పటాన్‌చెరు డివిజన్ కార్యదర్శి బి.నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం)రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా మండలంలోని ఇస్నాపూర్‌లో ప్రజల నుంచి విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. ఈ ప్రాంతంలో ప్రజా సౌకర్యార్థం మెట్రోరైలును పొడిగించాలని లింగంపల్లి నుంచి సంగారెడ్డి వరకు మహాపాదయాత్ర కార్యక్రమాన్ని గతంలోనే చేపట్టినట్టు గుర్తు చేశారు. పేదలకు ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కార్మికులకు కనీస వేతనాలు, ఇతర చట్టపరమైన సౌకర్యాల కోసం సీపీఐ(ఎం) నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. కాబట్టి అలాంటి పార్టీకి చెందిన మహాసభల జయప్రదం కోసం ప్రజల నుంచి విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టామన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగాధర్‌రావు, మూర్తి, జె.శ్రీనివాస్, సురేష్, శంకర్ మల్లయ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్ ఏఎంసీ సభ్యులను వెంటనే నియమించాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



నారాయణఖేడ్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మెన్ సభ్యులను వెంటనే నియమించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) జిల్లా ఉపాధ్య క్షులు జంబలి సంతోష్, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నారాయణఖేడ్ మార్కెట్ యార్డ్ కమిటీ ఎస్సీలకు దక్కిందని.. అందుకు గెజిట్ విడు దలై ఐదారునెలలైనా ఇప్పటికీ కమిటీ చైర్మెన్, సభ్యులను నియమించకపోవడం దారుణమన్నారు. ఎస్సీలకు చైర్మెన్ పదవీ రావడంతోనే వివక్షతో నియమించడం లేదన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే అన్ని మార్కెట్‌యార్డ్ కమిటీల చైర్మెన్‌లను, సభ్యులను నియమించారని.. కానీ నారాయణఖేడ్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మెన్ సభ్యులను నియమించకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఎస్సీలపై వివక్ష వీడి.. కమిటీ చైర్మెన్ సభ్యులను వెంటనే నియమించాలన్నారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ కంగ్టి మండలాధ్యక్షులు రాహుల్, నారాయణఖేడ్ పట్టణాధ్యక్షులు విజయ్, బాబురావు కల్హేర్ మండల అధ్యక్షులు, సిర్గాపూర్ మండల అధ్యక్షులు మోసప్ప, మనూరు మండల అధ్యక్షులు బి.ప్రవీణ్, నాగల్‌గిద్ద మండల అధ్యక్షులు శ్రీకాంత్, నారాయణఖేడ్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, నిజాంపేట్ మండల అధ్యక్షులు రామన్న తదితరులు పాల్గొన్నారు.

శైలజ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

కొమురం భీమ్ జిల్లా వాంకిడి మండల గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. ఏఐఎఫ్‌డీఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా కన్వీనర్ టెంకటి కుమార్ అధ్యక్షతన నారాయణఖేడ్ పట్టణంలోని గెస్ట్ హౌస్‌లో బుధవారం నిర్వహించారు. రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రితో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. శైలజ మృతికి ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కమిటీ తరుపున సంతాపాన్ని ప్రకటించారు. కాంగ్రెస్ రాజ్యంలో గురుకు లాలు మృత్యుకు హరాలుగా మారుతున్నాయన్నారు. ఆహారం విషతుల్య మై కొందరు, అనారోగ్యంతో ఇంకొందరు, ఆత్మహత్య చేసుకుని మరికొందరు విద్యార్థులు మరణిస్తున్నారన్నారు. పిల్లల మరణాలు తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగుల్చుతున్నాయన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ టెంకటి కుమార్, శివాజీ శంకర్, బాలాజీ, రమేష్, శివ శంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వీవీఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో నివసించే కోల్‌కత్తా రాష్ట్రానికి చెందిన మల్లేష్(90) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మున్సిపల్ యువజన నాయకులు వీ.ప్రవీణ్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. అనంతరం వీవీఆర్ ఫౌండేషన్ తరపున అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నరసింహులు, నాగేశ్వర్ రెడ్డి, దుర్యోధన, గోపి, కృష్ణారావు, తేజ, శ్రీకాంత్, రాజు, కార్తీక తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వసతిగృహంలో ఆర్డీఓ ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-జహీరాబాద్



స్థానిక ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌లో ఆర్డీవో రామ్ రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. హాస్టల్లో ఉన్న సమస్యలన్నిటినీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనంలో తీసుకుంటున్న చర్యలు.. మెనూ అమలు పరుస్తున్నారా లేదా అని ఆరా తీశారు. వసతి గృహ పరిసరాలను, వంటగదిని, సామాగ్రి గదిని, మరుగుదొడ్లను పరిశీలించారు. సామగ్రి గదిలో విద్యార్థులకు అందజేస్తున్న భోజన సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందజేస్తున్న అన్నం, పప్పు కూరగాయలు, గుడ్లు, మజ్జిగ నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు నివసిస్తున్న ప్రతి గదిని సందర్శించి రూమ్లలో ఉన్న విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాగా వర్షాకాలంలో రూఫ్ లీకేజ్ గురించి విద్యార్థులు ఆయనకు తెలిపారు. వసతి గృహంలో రిపేర్లకు కావాల్సిన ప్రతిపా దనలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారు లను ఆదేశిసానన్నారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్యం గురించి మాటాడుతూ.. వైద్య పరీక్షలు నెలవారీగా జరుగుతు న్నాయా లేదు తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహ సంక్షేమ అధికారి కృష్ణవంశీ, వసతి గృహ వంట సిబ్బందితో మాట్లాడి పిల్లలకు వండే ఆహారాన్ని పూర్తి పరిశుభ్ర వాతా వరణంలో వండి, వేడిగా ఉన్నప్పుడే విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు. హాస్టల్ వార్డెన్ వంశీకృష్ణ చేపడుతున్న కార్యక్రమాలను చూసి వార్డెన్ అభినందించారు.

అమ్మాయిలే రేపటి భావి భారత పౌరులు



నవతెలంగాణ-ఝరాసంగం

నేటి అమ్మాయిలే రేపటి భావి భారత పౌరులు, మంచి తల్లులు అని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి అన్నారు. 'బేటి బచావో బేటి పడావో' అనే నినాదంతో విద్యార్థినులను, మహిళలను చైతన్య పరచడం కోసం మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు సమాజంలో నిలదొక్కుకోవాలంటే ఆర్థికంగా ఎదిగినప్పుడు వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడగలుగుతారన్నారు. స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలుగుతారన్నారు. విద్యార్థులకు బాల్యం అనేది ఓ చక్కటి అవకాశమని, అలాంటి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలలో ఉన్న లైబ్రరీని సద్వినియోగం చేసుకుని మహనీయుల పుస్తకాలను చదివి మంచి విషయాలను స్వీకరించాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి నెగిటివ్ వైబ్స్‌కి దూరంగా ఉండాలన్నారు. 18ఏండ్లు పూర్తికాకుండా బాల్యవివాహాలను చేసుకోవడానికి వీలు లేదని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్న అధికారులకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీడీవో సుధాకర్, డీడబ్ల్యూఓ పల్లవి, సీడీపీఓ అంజమ్మ, సూపర్వైజర్లు అనిత కుమారి, రాధమ్మ, ప్రిన్సిపల్ ప్రిసిల్లా తదితరులు పాల్గొన్నారు.

పెద్దల పంచాయితీ.. మనస్తాపంతో ఆత్మహత్య

- ఆటో చోరీ చేసినందుకు రూ.5 లక్షల జరిమానా
- మనస్థాపంతో ఆత్మహత్య..
- మంజీరా నదిలో తల్లి, కొడుకుల మృతదేహాలు లభ్యం
- ఏడుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు

నవతెలంగాణ-జోగిపేట

అందోలు మండలం చింతకుంట మంజీరా నదిలో దూకి మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న వడ్ల శ్యామ్, బాలమణి(తల్లీకొడుకు) మృతదేహాలను బుధవారం మధ్యాహ్నం గజ ఈతగాళ్ల సహాయంతో బయటకు తీశారు. సీఐ అనిల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. ఈనెల 24న (ఆదివారం) రాత్రి చింతకుంటకు చెందిన చాంద్‌పాషా ఇంట్లో జరిగిన విందుకు సంగారెడ్డికి చెందిన బంధువులు టాటా ఏసీ ఆటోలో వచ్చారు. అయితే పార్క్ చేసిన స్థలం దగ్గర ఆటో కనిపించలేదు. మృతుడు ఆటోను ఎత్తుకెళ్లాడని సోమవారం చింతకుంట గ్రామపెద్దలకు వారు తెలపడంతో గ్రామ పెద్దలు మంగళవారం మృతుల కుటుంబ సభ్యులను పిలిపించి పంచాయితీ పెట్టారు. ఆటోను చోరీ చేసినందుకు గ్రామ పెద్దలు రూ.5 లక్షల జరిమానా విధించారు. దాంతో మనస్థాపం చెందిన వారు.. గ్రామంలో పరువు పోయిందని మంజీరా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుని తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు. ఈ ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. గ్రామానికి చెందిన అస్లాం, మొగుల్, చాంద్‌పాషా, మైబెల్లి, శ్రీశైలం, శ్రీనివాస్, అంజనేయులుతో పాటు మరో కరిపై కేసు నమోదు చేశామన్నారు.

మహాత్మ జ్యోతిరావు పూలే స్ఫూర్తితో పోరాడుతాం

నవతెలంగాణ-సంగారెడ్డి



మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డిలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి బుధవారం ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింలు ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ లు మాట్లాడుతూ.. అంటరానితనం నిర్మూలన, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, పోరాడిన గొప్ప ఉద్యమకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు. స్త్రీల హక్కుల కోసం, అందరికీ విద్య అందాలనే సదుద్దేశం తోటి, తన భార్యకు చదువు చెప్పి మహిళా ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దిన గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. నేటికీ ఇంకా అణచివేతకు ఆత్మగౌరవానికి గురవుతున్నారని.. వాటికి వ్యతిరేకంగా జ్యోతిరావు పూలే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో ప్రజాఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ అర్జున్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు పీపీఆర్ వ్యాక్సినేషన్ తప్పనిసరి

నవతెలంగాణ-న్యాల్‌కల్

వాతావరణ ప్రభావంతో గొర్రెలు, మేకలకు వ్యాధులు సంక్రమించకుండా పీపీఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని న్యాల్‌కల్ పశు వైద్యాధికారి గణేష్ సూచించారు. ఇబ్రహీంపూర్, హద్నూర్, డప్పూర్ గ్రామాల్లో 790 గొర్రెలకు, 345 మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ మందులను బుధవారం వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి లో ముసర వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న ఉద్దేశంతో.. రెండు బృందాలుగా 15 రోజులపాటు మేకలు, గొర్రెలకు పిపిఆర్ వ్యాక్సిన్ క్యాంపు చేపడుతున్నామన్నారు. ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను సన్న జీవాల పెంపకదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియలో పశువైద్యాధికారి గణేష్, జెవివో కిషన్ రావు, వీఏ లక్ష్మి, ఓఎస్ మాజీద్, ప్రభావతి, పశుపోషకులు ఉన్నారు.



నవతెలంగాణ
3
మెదక్
గురువారం | 28 నవంబర్ 2024 | www.navatelangana.com

ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన దుకాణాలను తొలగించాలి

మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి, తూప్రాన్ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. నర్సాపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో సభ్యులు అందరూ ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. అదేవిధంగా పలు పనులపై సమీక్షించారు. అనంతరం పట్టణంలో తిరుగుతూ ఫుట్ పాత్‌పై ఉన్న దుకాణాలను తొలగించాలని దుకాణదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి రామకృష్ణ రావు, వైస్ చైర్మన్ ఎండి నహీముద్దీన్, కౌన్సిలర్లు బుచ్చే యాదవ్, ఇస్రాత్, లలితా బిక్షపతి, లక్ష్మీ నాగేష్, రాజేందర్ మేనేజర్ మధుసూదన్ రావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక పప్రదర్శనను విజయవంతం చేయాలి

డీఈవో రాధాకృష్ణ



నవతెలంగాణ-మెదక్

జిల్లాలోని విద్యార్థులు అందరు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరై విజయవంతం చేయాలని డిఇఓ రాధాకృష్ణ కోరారు ప్రదర్శన నిర్వహించే స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ఇన్స్పైర్ మేళాను వెస్లీ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో 16 కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు సుస్థిర భవిష్యత్తు కోసం సాంకేతిక పై ఆధారపడి ఉంటుందన్నారు. ఆరోగ్యం, పరిశుభ్రత పై సహజ వ్యవసాయం, గణిత నమూనాలు వనరుల నిర్వహణ తదితర అంశాలపై ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో ప్రదర్శించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

తహసీల్దారుకు వినతి



నవతెలంగాణ-రామాయంపేట

ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రామాయంపేట తహశీల్దార్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకురాలు బాలమణి మాట్లాడుతూ నామమాత్రపు గౌరవ వేతనాలతో ఆశాలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. సమయపాలన లేకుండా ఆశాలతో పనులు చేయించుకుంటున్నారని ఆమె తెలిపారు. అలాగే వారికి కనీస వేతనాలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ రజనీకుమారికి అందజేశారు.

సర్వే వివరాలను డాటా ఎంట్రీ చేస్తున్న ఉద్యోగులు



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుటుంబ సమగ్ర సర్వే వివరాలను మండల పరిషత్ సిబ్బంది కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నారు. దాదాపుగా వారం రోజులుగా సర్వే వివరాలను ఆన్లైన్లో పొందుపరుస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ ఉద్యోగస్తులు మాత్రం పనిలో లీనమైనారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్‌లు శ్రీనివాస్, శ్రీధర్, టీచర్ గుడ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు

సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థులు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాయి, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్‌లు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ మాసాయిపేట్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో తమ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వారు తెలిపారు. వీరు డిసెంబర్‌లో నిర్మల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి లక్ష్మణ్, పిఈటి లింగం గౌడ్, రాజు ఉపాధ్యాయులు ఉన్నారు.

నిరుపేద కుటుంబానికి పుస్తె మట్టెలు

నవతెలంగాణ-హవేలి ఘనపూర్



నిరుపేద కుటుంబానికి చెందిన పూసల లక్ష్మి, కృష్ణ దంపతుల కూతురు వధువు హేమలతకు బీఆర్ఎస్ నాయకులు పుస్తె మట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మేకల సునీత సాయిలు మాట్లాడుతూ బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే యం.పద్మ దేవేందర్ రెడ్డి సహకారంతో పుస్తె మట్టెలను అందజేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రామచంద్రారెడ్డి, కమ్మరి ఆంజనేయులు, గుండ సత్యనారాయణ, కుమ్మరి శేఖర్,మన్నె శ్రీనివాస్, పోచెందర్,శ్రీకాంత్, నాగరాజు, ఎరుకల కుమార్, కల్లా అరవింద్, పూసల నర్సింలు,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సృజన



నవతెలంగాణ-నర్సాపూర్

విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని నర్సాపూర్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సృజన అన్నారు. బుధవారం నర్సాపూర్ మండల పరిధిలోని చిప్పల్ తుర్తి గ్రామ శివారులో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గల విద్యార్థులకు హెచ్‌బీ, ఆర్‌బిఎస్, బిపి, వంటి అన్ని ప్రాథమిక ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత విద్య పోషకాహారం రుతు సమస్యల వంటి వివిధ అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతేకాకుండా సీజనల్ వ్యాధులు పట్ల విద్యార్థులు అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎవో డాక్టర్ ఫౌజియా, డాక్టర్లు కృష్ణ కుమార్, పద్మావతి, సాహిత్య, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సర్వే డాటా ఎంట్రీని పరిశీలించిన జెడ్పీ సీఈఓ

నవతెలంగాణ-నిజాంపేట



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుటుంబ సమగ్ర సర్వే వివరాలను ఎంట్రీ చేస్తున్న మండల పరిషత్తు సిబ్బందిని జెడ్పీ సీఈవో ఎల్లయ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుటుంబ సమగ్ర సర్వేను ఎలాంటి తప్పులు దొర్లకుండా డేటా ఎంట్రీ చేయాలని ఉద్యోగులకు సూచించారు. ఈ డాటా ఎంట్రీతో తెలంగాణలో కుల గణన కుటుంబ వివరాలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి అందించడం జరుగుతుందన్నారు. దాదాపు వారం రోజుల నుంచి సిబ్బంది డాటా ఎంట్రీలో లీనమైనారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, ఎంపీ ఓ ప్రవీణ్ కుమార్, ఏపీవో శ్రీనివాస్, కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీనివాస్, శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్లు జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాల నమోదు ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

- ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





నవతెలంగాణ-రామాయంపేట

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఆన్లైన్ నమోదు ప్రక్రియను సజావుగా, వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని అక్కన్నపేట గ్రామంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఇంటింటి సర్వే డేటా ఆన్‌లైన్ కంప్యూటరీకరణ కేంద్రాన్ని ఆయన సందర్శించి, డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. సర్వర్ పనితీరు గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొందర కంటే పారదర్శక డేటా ఎంట్రీ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు, ఇప్పటివరకు జిల్లాలో సర్వే ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకున్నామని, జిల్లాలో డేటా ఎంట్రీ 55,000 కుటుంబాలకు పూర్తయిందని తెలిపారు.

ప్రజలు సమగ్ర కుటుంబ సర్వేలో అందించిన సమగ్ర సమాచారాన్ని గోప్యతతో ట్రంకు బాక్సులో భద్రపరిచి ఎంపీడీవో ఆధ్వర్యంలో, మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఉన్నట్లు తెలిపారు. ఎన్యుమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమన్వయంతో డేటా ఎంట్రీ వారం రోజుల్లో తుది దశకు చేరుకుంటుందన్నారు. డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు చేయరాదన్నారు. ప్రతి కుటుంబం సమగ్ర వివరాలను క్షుణ్ణంగా, సజావుగా నమోదు చేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి..

ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులను, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన 1,73,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీస్, ట్రక్ షీట్ జనరేట్, మిల్లర్స్ రసీదు పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఎంట్రీలో అలసత్వం పనికిరాదని, ఇవన్నీ పూర్తి చేసిన పక్షంలో, అప్పుడు మాత్రమే కొనుగోలు చేసిన ధాన్యానికి, ప్రభుత్వం ద్వారా త్వరితగతిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవ్వటం జరుగుతుందని తెలిపారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే మిల్లర్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చిత్తశుద్ధితో వ్యవహరించి రైతులకు న్యాయం జరిగే విధంగా పగడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా లారీలను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదేరోజు రవాణా చేపట్టాలన్నారు. సంక్షేమ హాస్టల్ లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులకు సూచించారు. సంబంధిత ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు హాస్టల్లో పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తహశీల్దార్ రజని కుమారి, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు ఉన్నారు.

కేజీబీవీ సర్వ శిక్ష ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వాలి

యూటీఎఫ్ డిమాండ్



నవతెలంగాణ-నర్సాపూర్

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా, ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ నర్సాపూర్ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు రవి, గంగాధర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం నర్సాపూర్ మండల పరిధిలోని చిప్పల్‌తుర్తి గ్రామంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు, ప్లే కార్డులు పట్టుకొని భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు చాలీచాలని జీతాలతో జీవితాలు గడపడం భారమవుతుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. పని భారం ఎక్కువ అవుతున్నా జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కేజీబీవీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉపాధ్యాయులకు కనీస వేతనం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో కేజీబీవీ నాయకులు సువాసిని, పాఠశాల ప్రత్యేక అధికారి శ్వేత, ఉపాధ్యాయులు సరిత, శ్రీలత, విష్ణు తేజ, గీతాంజలి, జబీనా సుల్తానా, ప్రమీల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనాన్ని పరిశీలించిన చైర్మన్



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని బుధవారం గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రంథాలయాన్ని విద్యార్థులకు నిరుద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. పోటీ పరీక్షలలో నెగ్గెందుకు గ్రంథాలయాల్లో పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రంథాలయంలో చదువుకొని ఉద్యోగాన్ని సాధించుకోవడానికి మంచి అనువైన ప్రదేశమే గ్రంథాలయమన్నారు. నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని నెల రోజుల్లోగా ప్రారంభోత్సవం చేసి పాఠకులకు చదువుకునేందుకు అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. మాసాయిపేట మండల కేంద్రంలోని గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. గ్రంథాలయంలో మౌలిక వసతులను త్వరలోనే కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి వంశీకృష్ణ, మాసాయిపేట మండల గ్రంథాలయ శాఖ లైబ్రేరియన్ అర్చన, వెల్దుర్తి గ్రంథాలయ శాఖ లైబ్రేరియన్ స్వామి, నాయకులు శేఖర్ గౌడ్, కృష్ణ గౌడ్ తదితరులున్నారు.

మాసాయిపేట ఎంపీపీ కార్యాలయ ఏర్పాటుకు గెజిట్

హర్షం వ్యక్తం చేసిన మాసాయిపేట మండల సాధన సమితి



నవతెలంగాణ-వెల్దుర్తి

గతంలో మాసాయిపేట మండలంగా ప్రకటించి అరకొర కార్యాలయాలతో ఉన్న మాసాయిపేట మండలానికి కాంగ్రెస్ ప్రభుత్వం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఏర్పాటుకు గెజిట్ విడుదల చేసింది. గెజిట్ విడుదల చేయడం పట్ల మాసాయిపేట సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం ప్రజలు మండల కేంద్రంలో ఆనందోత్సవాలు చేసుకున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన మండల ఏర్పాటు చేసినప్పటికీ గెజిట్ విడుదల చేయలేదు. దీంతో మండల కేంద్రంగా కార్యాలయాలు ప్రారంభం కాలేదు. మంగళవారం నూతన మండలంగా 13 గ్రామాలతో కలసి మాసాయిపేట మండలాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేసింది. దీంతో బుధవారం గ్రామానికి చెందిన సాధన సమితి నాయకులు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి పటాకులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టుకొని సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్న రాజనర్సింహ, మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాసాయిపేట సాధన సమితి నాయకులు పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించండి

డిఎల్‌పిఓ సురేష్ బాబు



నవతెలంగాణ-పాపన్నపేట

విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాపన్నపేట మండలం ఫుడ్ సెక్యూరిటీ ఇన్స్పెక్షన్‌లో భాగంగా డిఎల్‌పిఓ సురేష్ బాబు కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో ఆహార పదార్థాలను తనిఖీలు నిర్వహించారు. జెడ్ పి హెచ్ ఎస్, ప్రైమరీ స్కూళ్లను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. గ్రామ పారిశుధ్య నిర్వహణకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. వంట మనుషులు సేఫ్టీ కోసం చేతులకు గ్లౌజులు మాస్కులు ధరించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, జెడ్‌పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు దత్తు రెడ్డి, టీచర్ రాజు ఇతరులు పాల్గొన్నారు

రైతు విజయోత్సవ సభను విజయవంతం చేయాలి

కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మెదక్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ -పాపన్నపేట

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 29 30 తేదీలలో నిర్వహిస్తున్న రైతు విజయోత్సవ సంబరాలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మెదక్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి పార్టీ శ్రేణులను, రైతులను కోరారు. కొత్తపల్లి సొసైటీ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రైతులకు పెద్దపీట వేస్తూ బాసటగా నిలుస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించిందన్నారు. సాంకేతిక కారణాలతో ఆగిపోయిన మిగతా రైతుల రుణమాఫీ త్వరలో మాఫీ అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి బడ్జెట్లోనే రూ.72 వేల కోట్లు కేటాయించి ఇటు తెలంగాణ, అటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో వ్యవసాయానికి అత్యధిక బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వంగా ఈ ప్రభుత్వం నిలిచిందన్నారు. గత యాసంగిలో రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. మహబూబ్‌నగర్ రైతు విజయోత్సవ సభకు నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్, సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్ గుప్తా, మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మైనారిటీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆఫీస్ మోల్ సబ్, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, సందీప్, రమేష్ గౌడ్, ముజీబ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పంట వ్యర్థాలను కలియ దున్నితే అధిక దిగుబడి

వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్ నారాయణ



నవతెలంగాణ-నార్సింగి

పంట వ్యర్థాలను కాల్చకుండా కలియదున్నితే అధిక దిగుబడి వస్తుందని రామాయంపేట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్ నారాయణ అన్నారు. మండల వ్యవసాయ అధికారి మెంగని యాదగిరి తో పాటు మండల పరిధిలోని శంకాపూర్, శేరీపల్లిలో క్షేత్ర స్థాయి పర్యటన చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రామాయంపేట వ్యవసాయ డివిజన్ పరిధిలో దాదాపు 90 శాతం కోతలు పూర్తి అయ్యాయని తెలిపారు. కోతల అనంతరం పొలాల్లో మిగిలి పోయే వరి కొయ్యలను కాల్చడం కంటే కలియ దున్నడం వల్ల రైతులకు అనేక లాభాలు వస్తాయన్నారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూమిలోని పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు, వాన పాములు చనిపోతాయని, పై పొరలో ఉండే సేంద్రియ కర్బన పదార్థాలు దెబ్బతింటాయని అందువల్ల పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని వివరించారు. వరి కొయ్యలను కలియ దున్నడం వల్ల పంటలో నీటి నిలువ సామర్థ్యం పెరిగి, సేంద్రియ కర్బన పదార్థాలు పెరుగుతాయని, నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి స్థూల, సూక్ష్మ పోషకాలు పంటకు అంది దిగుబడి పెరుగుతుందన్నారు. పంట వ్యర్థాలు త్వరగా కుళ్లడానికి రైతులు 40 - 50 కేజీల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 15 కేజీల యూరియా లేదంటే మార్కెట్‌లో లభ్యమయ్యే వేస్ట్ డికంపోజ్ ద్రావణాన్ని చల్లుకుని, రోటివేటర్‌తో గాని లేదా కల్టివేటర్‌తో కలియ దున్నినట్లయితే సూక్ష్మ జీవులు, వాన పాముల సంతతి పెరిగి పంట దిగుబడికి దోహద పడతాయన్నారు. పంట వ్యర్థాలను కాల్చినట్లయితే పంటకు నష్టం తో పాటు, వాయు కాలుష్యం పెరిగి రైతుల ఇతరుల ఆరోగ్యం, పర్యావరణం దెబ్బ తింటుందన్నారు. కావున రైతులు వ్యర్థాలను కాల్చ వద్దని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కందరి శ్రీనివాస్, కందరి మల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సంస్కారం ఉండాలి

మదనానంద సరస్వతి



నవతెలంగాణ-పాపన్నపేట

విద్యతో పాటు సంస్కారం నేర్పాలని రంగంపేట పీఠాధిపతి మదనానంద సరస్వతి అన్నారు. పాపన్నపేట జూనియర్ కళాశాల విద్యార్థులు టేక్మాల్‌లోని శ్రీ ఉమా సంగమేశ్వర ఆలయంలో కార్తీక వనభోజనాలయం నిర్వహించారు. సమాజంలో గౌరవంగా బతికి తల్లి దండ్రులకు, గురువులకు, దేశానికి మంచి పేరు తీసుకు రావాలని పిలుపునిచ్చారు. మానసిక ఉల్లాసం కోసం నిర్వహించిన క్రీడల్లో విజేతలైన వారికి ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాపన్నపేట, టేక్మాల్, శంకరంపేట ప్రిన్సిపాల్స్ నర్సింలు, సుభాష్ చంద్ర, శోభారాణి. అధ్యాపకులు సంతోష్, ప్రవీణ్ కుమార్, సంధ్యారాణి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉన్నారు.

కిష్టాపూర్ అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన డిప్యూటీ తహశీల్దార్

డిప్యూటీ తహశీల్దార్ మన్నె ప్రభుదాస్





నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండలంలోని కిస్టాపూర్ గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ మన్నె ప్రభుదాస్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో భోజనాల నాణ్యత బాగుందని తెలిపారు.జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ ఇన్స్పెక్షన్ చేశామని తెలిపారు. బాలింతలకు అందించే భోజనాలు,పాలు,గుడ్లు, చిన్నపిల్లలకు అందించే పోషకాహార పదార్థాలన్నీ మెనూ ప్రకారమే అందిస్తున్నట్లుగా తెలిపారు. అంగన్వాడి కేంద్రంలోని పిల్లలు,అంగన్వాడీ కార్యకర్తతో కలిసి భోజనం చేశారు.కిష్టాపూర్ అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం డిప్యూటీ తహశీల్దార్ మన్నె ప్రభుదాస్ సంతృప్తిని వ్యక్తం చేశారు.

సీఐటీయూలో చేరిన కంప్యూటర్ ఆపరేటర్లు



- కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మరాటీ కృష్ణమూర్తి

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మరాటి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. కంప్యూటర్ ఆపరేటర్లను సీఐటీయూలోకి ఆహ్వానించి సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ ఆపరేటర్లకు జీపీల నుంచి రొటేషన్ పద్ధతిలో జీతాలు చెల్లిస్తున్నారని అలాకాకుండా ట్రెజరీ నుంచి నేరుగా కంప్యూటర్ ఆపరేటర్లకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరికి జూనియర్ అసిస్టెంట్ స్కేల్ ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళలకు మెటర్నీ లీవులు మంజూరు చేయాలని అన్నారు. పదేండ్లుగా పనిచేస్తున్న వీరిని పర్మినెంట్ చేయలేదన్నారు. ఇప్పటికైనా ఈ ప్రజా ప్రభుత్వం కంప్యూటర్ ఆపరేటర్లను ఉద్యోగ భద్రత కల్పించి వీరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గజ్వేల్ డివిజన్ నాయకులు పొట్టోల్ల దాసు, కంప్యూటర్ ఆపరేటర్లు ఎం లక్ష్మి సిహెచ్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజానికి కృషి చేద్దాం

- రామవరం మెడికల్ ఆఫీసర్ వినోద్
- హెచ్ ఈ వెంకటలక్ష్మి

నవతెలంగాణ-అక్కన్నపేట



పొగాకు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని రామవరం ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్, హెచ్ ఈ వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజాతో కలిసి గ్రామంలో పొగాకు రహిత సమాజం కోసం పాటుపడాలని సూచించారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలకు 100 మీటర్ల దూరంలోని కిరాణా షాపుల్లో ఇలాంటి పొగాకు అమ్మకాలు చేయవద్దని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కొమురయ్య, ఎంఎల్ హెచ్ పి శిరీష, ఏఎన్ఎం మంజుల, ఆశాలు, తదితరులు, పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష కాంట్రాక్టర్ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-మిరుదొడ్డి



విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు మహేష్ అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టర్ ఉద్యోగులు మండల వనరుల కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వం రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి నేటికి అమలు చేయకపోవడం సరైనది కాదన్నారు. రెగ్యులరైజ్ అయ్యేంత వరకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలన్నారు. 15 రోజుల్లో తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని తేల్చి చెప్పారు. అనంతరం తమ డిమాండ్ల వినతిపత్రాన్ని ఎంఈఓ ప్రవీణ్ బాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు బాలరాజు, కిష్టయ్య, స్వప్న విజయ చంద్రకళ, మతిన్, స్రవంతి పలువురు పాల్గొన్నారు.

ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ పరిశీలన

- అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-సిద్దిపేట



జిల్లా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్‌తో కలిసి ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ నిర్వహణను బుధవారం పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహించారు. తెలుసుకొని, ఆపరేషన్ అనంతరం సంరక్షణలో ఉంచే గదులను పరిశీలించారు. ఆరో వార్డులో తయారవుతున్న సేంద్రియ ఎరువు కేంద్రాన్ని పరిశీలించి, సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ ఎరువు తయారీ విధానానికి ఎన్ని రోజులు పడుతుంది, తయారీ విధానం, తయారైన సేంద్రియ ఎరువుని ఎవరెవరికి విక్రయించడం జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే యొక్క దరఖాస్తులు ఆన్లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సలీం, మున్సిపల్ అధికారులు, సిబ్బంది శ్రీకాంత్, వనిత తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగొద్దు

- డీపీఎం కర్ణాకర్

నవతెలంగాణ -నంగునూరు



కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీపీఎం కర్ణాకర్ అన్నారు. బుధవారం నంగునూరు మండల పరిధిలోని అంక్షాపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో కనీస అవసరాలు నీళ్ల కరెంటు నీడ ఏర్పాటు చేయాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు. ఇప్పటివరకు మండలంలోని ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ఏడు సెంటర్లలో 829 మంది రైతుల నుంచి 31 వేల 1 వంద 13 క్వింటల్స్ ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతులు దళారీల బారిన పడకుండా ప్రభుత్వము ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ధాన్యం విక్రయించి మద్దతు ధర ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320లు, కామన్ గ్రేడ్ ధాన్యానికి రూ.2300లు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మహిపాల్, సీసీలు లింగం, సాయిలు, వీఓఏ విజయ్, కమిటీ సభ్యులు జ్యోతి, సంధ్య, పాల్గొన్నారు.

ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నవతెలంగాణ-సిద్దిపేట



టీజీఈజేఏసీ స్టేట్ చైర్మెన్ లచ్చిరెడ్డిని కలిసి ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, పే స్కేల విధానాన్ని అమలు చేయాలని, అసెంబ్లీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల గురించి చర్చ జరపాలని వినతి పత్రం అందించినట్లు రాష్ట్ర ఔట్సోర్సింగ్ జేఏసీ, సిద్దిపేట జిల్లా జేఏసీ ప్రెసిడెంట్ పొనమల్ల యాదగిరి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 9 నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల గురించి మాట్లాడాలని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించినా ఆయన ఔట్సోర్సింగ్ ఉద్యోగుల యొక్క విషయం ముఖ్యమంత్రి దృష్టిలో ఉందని, త్వరలో మీరు తీపి కబురు అందుకుంటారని చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు జైన నవీన్ కుమార్, పోతుల నర్సింలు, గుండాల సాయిబాబా, పోతుల రాజమల్లు, రాజిరెడ్డి, దీపక్, రతన్, పాల్గొన్నారు.

నారుమడికి యాజమాన్య పద్ధతులు మేలు

- ఏవో తస్లీమా సుల్తానా

నవతెలంగాణ-అక్కన్నపేట



వరి సాగులో నారుమడి ఎంతో ముఖ్యమైనదని, యాజమాన్య పద్ధతిలో నారుమడి వేయాలని అక్కన్నపేట మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా అన్నారు. బుధవారం మండలంలోని గౌరవెల్లి గ్రామంలో రైతులు నారు పోసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగిలో నీటి లభ్యత వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తొందరగా కోతకు వచ్చే వరిని సాగు చేసుకోవాలన్నారు. దీనికోసం జేజీఎల్ 24423 రకం విత్తనాలు ఎంచుకోవడం ఉత్తమమైనదని తెలిపారు. ఈ నారు సాగు చేస్తే కేవలం 120 నుంచి 130 రోజుల్లోనే పంట కోతకు వస్తుందని, దీనివల్ల వడగళ్ల వాన నష్టం తప్పుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శేఖర్, రైతులు పులి ఎల్లయ్య అనిల్, తదితరులు, పాల్గొన్నారు.

ప్రజల ఎజెండాయే ప్రజా సంకల్ప దీక్ష

నవతెలంగాణ-చేర్యాల

పార్టీల ఎజెండా కాదు ప్రజల ఎజెండాయే ప్రజా సంకల్ప దీక్ష అని జేఏసీ చైర్మెన్ ఆర్.పరమేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద దీక్ష స్థలాన్ని బుధవారం జేఏసీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల ప్రాంత ప్రజల ఎజెండా, ఆకాంక్షను సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే దీక్ష యొక్క ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఎంతో ఘన కీర్తి చాటుకున్నటువంటి చేర్యాల ప్రాంతం 2009 నియోజకవర్గం కోల్పోవడంతో తన అస్తిత్వమే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. చేర్యాలకు పూర్వ వైభవం తీసుకురావడం కోసం నాలుగు మండలాల ప్రజలు తరలివచ్చి ఆకాంక్షను ప్రభుత్వానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోజేఏసీ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్




సిద్దిపేటఅర్బన్ మండలం ఎన్సాన్ పల్లికి చెందిన సామాజికవేత్త బాలరాజ్ కృష్ణమూర్తి బుధవారం గ్రామానికి చెందిన డెంగ్యూ బాధితుడు మస్కు రాజిరెడ్డికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రామంలోని పేద వారికి తన వంతుగా సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పిస్తూ సామాజిక సేవ చేస్తున్నట్టు తెలిపారు. అనారోగ్యం కారణంగా శక్తికి మించి డబ్బులు ఖర్చు పెట్టి ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదవారు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్కన్నపేట కాంగ్రెస్‌లో అంతర్మథనం

- నికార్సైన నేతలకు గుర్తింపు కరువు
- పనిచేయని వారికి పదవులు
- పదేళ్లు కష్టపడ్డ ఫలితం శూన్యం
- మంత్రి ఇలాకాలో కార్యకర్తల్లో అయోమయం

నవతెలంగాణ-అక్కన్నపేట

హుస్నాబాద్ ప్రాంతం అంటేనే ప్రశ్నించేతత్వం ఉన్నటువంటి ప్రజలు నివసించే నియోజకవర్గం. అలాంటి నియోజకవర్గంలో ఎర్రన్నలే ఎక్కువసార్లు జెండాలు పాతారు. అలాంటి ఈ ప్రాంతానికి ఇందుర్తి నియోజకవర్గం నుంచి మొదలు హుస్నాబాద్ నియోజకవర్గం వరకు మంత్రి పదవి చేపట్టిన దాఖలాలు అయితే లేవు. కానీ మంత్రి పొన్నం ప్రభాకర్ గెలుపుతో హుస్నాబాద్ ప్రజల ఆకాంక్ష నెరవేరినట్లు అయింది. నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఉద్యమ నాయకుడు పొన్నం ప్రభాకర్‌కు పట్టం కట్టారు. ఆయన గెలుపు కోసం ఎంతోమంది కార్యకర్తలు నిబద్ధతతో పనిచేశారు. అలాంటి నియోజకవర్గంలో అక్కన్నపేట మండలం చాలా స్పెషల్ ఈ ప్రాంతం నుంచి దాదాపుగా కాంగ్రెస్ పార్టీకే అత్యధిక ప్రాధాన్యత లభించింది. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఈ పార్టీకే ఎక్కువ ఓట్లు పడ్డాయి. దీంతో పొన్నం ప్రభాకర్ గెలుపు సాధ్యమైంది. కాంగ్రెస్ గెలుపు కోసం గత పదేండ్ల నుంచి ఎదురుచూస్తున్న ఎంతోమంది కార్యకర్తలు అహర్నిశలు పనిచేసి పొన్నం ప్రభాకర్‌ను తీరాలకు తీసుకెళ్లారు. చివరికి కాంగ్రెస్ వీరుల కృషితో పొన్నం విజయం సాధించి మంత్రి పదవి కూడా పొందారు. దీంతో కార్యకర్తలు ఎంతో సంబరపడి గత పదేళ్లుగా బీఆర్ఎస్ పాలనలో ఎదుర్కొన్న కష్టాలను కూడా మర్చిపోయారు. తీరా గెలుపొందాక పొన్నం ప్రభాకర్ అసలైన కార్యకర్తలను మరిచారని మండల వ్యాప్తంగా గుసగుసలు వినిపిస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ జెండా మోసిన వారిని పక్కనపెట్టి పార్టీలు మారి వచ్చిన వారికి పెద్దపీట వేస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తల్లో టాక్ వినిపిస్తోంది. తాజాగా మండలాధ్యక్షుడుగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నటువంటి ఐలయ్యకు కూడా ఎలాంటి నామినేటెడ్ పదవి రాకపోవడంతో, అక్కన్నపేట మండలంపై మంత్రికి చిన్న చూపు ఉందని గుసగుసలు పెట్టుకుంటున్నారు.



మరి దీనిపై మంత్రివర్యులు ఎలా స్పందిస్తారు అనేది తెలియాల్సి ఉంది. ఇది ఇలాగా ఉంటే రాబోవు రోజుల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఊహించలేమని, స్వయానా పార్టీ శ్రేణులే బహిరంగంగా అనుకోవడం కనిపిస్తోంది. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీని గడ్డు కాలంలో వెన్నుదన్నుగా నిలిచి పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన కార్యకర్తలను గుర్తించి వారికి స్థాయికి తగ్గట్టు గౌరవించే విధంగా మంత్రి పొన్నం ప్రత్యేక దృష్టి సారించి అందరికీ న్యాయం చేయాలని కోరుతున్నారు. ఒకవేళ ఇదే పరిస్థితి కొనసాగితే మాత్రం రాబోయే రోజుల్లో హుస్నాబాద్ నియోజవర్గంలో కాంగ్రెస్ బతికి బట్ట కట్టే అవకాశం లేదంటూ కార్యకర్తలకు గుసగుసలు పెట్టుకోవడం కోసమెరుపు.?

ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ -ములుగు: ఉచిత పశు వైద్య శిబిరాలను, గోపాలమిత్ర సేవలను రైతులు ఉపయోగించుకొని పశు సంపదను పెంచుకోవాలని మండల పశు వైద్య అధికారిని డాక్టర్ పల్లవి రైతులకు సూచించారు. బుధవారం ములుగు మండల్ జప్తిసింగాయపల్లి గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ , పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా డాక్టర్ పల్లవి ఆధ్వర్యంలో గోపాల మిత్రుల సహకారంతో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 36-పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు 5-పశువులకు గర్భధారణ సూదులు, 3-పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు, 47-పశువులకు సాధారణ చికిత్సలు, 32-దూడలకు నట్టల నివారణ మందులు, 53-పెద్ద పశువులకు నట్టల మందులు అందించారు. అలాగే 185- పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్, జేవివో తాజుద్దీన్, ఓఎస్ కృష్ణ గోపాలమిత్ర సూపర్వైజర్ భాస్కర్ గౌడ్, గోపాల మిత్రులు ఆంజనేయులు, రాజు పాడి రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) బహిరంగ సభ జయప్రదం చేయండి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య

నవతెలంగాణ-కొండపాక

డిసెంబర్ 1న గజ్వేల్‌లో సీపీఐ(ఎం) జిల్లా బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య పిలుపునిచ్చారు. బుధవారం మర్పడ్గ, సిరసనగండ్ల, కొండపాక, గ్రామాల హమాలీ కార్మికుల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1, 2తేదీల్లో పార్టీ సిద్దిపేట జిల్లా 3వ మహాసభలు గజ్వేల్ పట్టణంలో జరుగుతున్నాయని 1వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహింస్తారని దానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి రానున్న కాలంలో పోరాటాలను ఉధృతం చేసేందుకు ఈ మహాసభ వేదిక కానున్నదని అన్నారు. హామీల అమలు కోసం ప్రతి ఒక్కరు పోరాటాలకు రావాలని రానున్న కాలంలో ప్రజా సమస్యలపై



అనేక పోరాటాలు నిర్వహిస్తామన్నారు. 1న బహిరంగ సభ ,2 తేదీన ప్రతినిధుల సభ జరుగుతుందని తెలిపారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం,కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, హాజరవుతున్నారని తెలిపారు. 1న జరిగే బహిరంగ సభకు ఉమ్మడి మండలం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యులు తటోజు రవీంద్రచారి, నాయకులు బి.కొమురయ్య,గుమ్మడిదల లింగయ్య, మల్లేశం, ఎల్లయ్య, నర్సయ్య, అయిలయ్య, కనకయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ స్థానిక లయన్స్ భవన్(నర్సాపూర్ క్రాస్ రోడ్డు)లో గురువారం నిర్వహించడం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు తుమ్మ సత్యం, ప్రధానకార్యదర్శి కనకరాజు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈ నెల 21న మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన పాఠశాలల విద్యార్థులు జిల్లా స్థాయికి రావాలని సూచించారు. ఉదయం 9.30 గంటల వరకు విద్యార్థులు తమ గైడ్ టీచర్‌తో రావాలని తెలిపారు. 10 గంటల వరకు తమ తమ పాఠశాలలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, 10.30 గంటలకు జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం భోజనానంతరము అతిథులచే బహుమతి



ప్రధానోత్సవం జరుగుతుందని, విద్యార్థులందరూ సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు మొలుగు బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు సాదత్ అలీ, రాజమౌళి, బాలకిషన్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు జోజి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్

నవతెలంగాణ-జగదేవపూర్

మండల కేంద్రంలో వంటేరు సందీప్ రెడ్డి (32) వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అతను ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతు బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నాడని నమ్మదగిన సమాచారంపై జగదేవపూర్ బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ లింగం వెంటనే లొకేషన్ ద్వారా అతని ఇంటికి వెళ్లి ఇంటి డోరు పగలగొట్టి ఉరి నుంచి కిందికి దించి అతను అపస్మారక స్థితిలో ఉండగా వెంటనే సీపీఆర్ చేసి స్పృహ రాగానే గజ్వేల్ ఆసుపత్రికి వారి బంధువులతో కలిసి పంపించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి తదుపరి హైదరాబాద్ గల యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం సందీప్ రెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉంది. లింగం కానిస్టేబుల్ సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడినందుకు సందీప్ రెడ్డి కుటుంబ సభ్యులు, పోలీస్ కమిషనర్ డాక్టర్ బి



అనురాధ, గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి, కానిస్టేబుల్ లింగమును అభినందించారు. త్వరలో పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా రివార్డు అందజేయడం జరుగుతుందని గజ్వేల్ ఏసీపీ తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్ కుమార్

నవతెలంగాణ-కొమురవెల్లి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనీ ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కొమురవెల్లి మండలంలో ఉన్న కేజీబీవీ హాస్టల్‌ను సందర్శించారు. అనంతరం భరత్ మాట్లాడుతూ కేజీబీవీలో మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను కోరారు. విద్యార్థులకు బ్లాంకెట్స్ , స్వెటర్లు, స్నానాలకు వేడి నీళ్లు అందించాలని



అధికారులకు సూచించారు. ఇటీవల అనేక హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ సమస్యలు తలెత్తుతున్నాయని, విద్యార్థులకు ఆరోగ్యపరంగా అన్ని సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు జస్వంత్ మౌనిక, హారిక, తదితరు పాల్గొన్నారు

నేడు జరిగే పోరుదీక్షను జయప్రదం చేయండి

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల రూరల్, చేర్యాల పట్టణం, కొమురవెల్లి, మద్దూరు, దూలిమిట్ట మండలాలతో కలిపి చేర్యాలను రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నేడు మండల కేంద్రంలోని అంగడి బజారు అంబేద్కర్ విగ్రహం ఎదుట తలపెట్టిన పోరు దీక్షను జయప్రదం చేయాలని బీజేపీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు బూరుగు సురేష్ గౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని అన్ని రకాలుగా వాడుకుని నిర్లక్ష్యానికి గురి చేసిన ఈ పాలకులను తరిమికొట్టవలసిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు మాత్రం ఒక జేఏసీని ఏర్పాటు చేసుకొని మేమే రెవిన్యూ డివిజన్ తెస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మీకెందుకు జేఏసీ అని ప్రశ్నించారు. ఈ ప్రాంత ప్రజలను మరోసారి కాంగ్రెస్ తన మోసపూరిత వైఖరితో కాలయాపన చేసుకుంటూ రెవిన్యూ డివిజన్ రాకుండా అడ్డుపడుతుందని విమర్శించారు. రెవిన్యూ డివిజన్ సాధనే లక్ష్యంగా నేడు జరిగే పోరుదీక్షలో ఈ ప్రాంతంలో ఉన్న మేధావులు, కళాకారులు, విద్యావంతులు, కర్షకులు, వర్తకులు,విద్యార్థి, యువజన సంఘాలు, కుల, మహిళా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ జనగామ నియోజకవర్గ కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి, తాడూరు మాజీ సర్పంచ్ నర్ర మహేందర్ రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షులు కాటం సురేందర్, విద్యాసంస్థల డైరెక్టర్ కర్క తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

తొగుట ఎల్లారెడ్డిపేట పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు గురించి అవగాహన

- తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని గుర్తించాలి
- తొగుట సిఐ ఎస్కే లతీఫ్

నవతెలంగాణ-తొగుట

పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని తొగుట సీఐ ఎస్కే లతీఫ్ సూచించారు. బుధవారం ఎల్లారెడ్డిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి తొగుట సిఐ, గజ్వేల్ షీటీమ్ బృందం అవగాహన కల్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ విద్యార్థి దశ కీలకం, జీవితంలో మళ్లీ ఎప్పుడు ఇలాంటి సమయం రాదు. చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిస కావొద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని, డ్రగ్స్ , ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నూతన చట్టాలతో మహిళల రక్షణకు పెద్దపీట, నేరం చేసిన నేర స్తులకు కఠినమైన శిక్షలు అమలు చేస్తున్నామన్నారు. మహిళలు, పిల్లలు ఎవరితోనైనా హింసకు పాల్పడిన, హేళనంగా మాట్లాడిన మౌనం వీడి తల్లిదండ్రులకు, స్నేహితులకు చెప్పుకోవాలని అన్నారు.



లేనిపక్షంలో డయల్-100 కు కాల్ చేసి తక్షణం పోలీస్ సహాయం పొందాలన్నారు. వెంటనే షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712667343, మహిళా పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435 సమాచారం అందించాలని కోరారు. సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాధికారి నర్సయ్య, ఉపాధ్యాయులు, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ రామచంద్రారెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

నవతెలంగాణ- గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సిద్దిపేట జిల్లా నూతన కమిటీని సిద్దిపేట పట్టణంలోని జడ్‌పీహెచ్ఎస్ ఇందిరానగర్ పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీఎస్‌జీహెచ్ ఎంఏ రాష్ట్ర అధ్యక్షులు రాజభాను చంద్ర ప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజగంగారెడ్డి హాజరై ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యం వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా జిల్లా కమిటీని ఎన్నుకోన్నామని ప్రకటిస్తూ జిల్లా అధ్యక్షునిగా మహమ్మద్ కరీముద్దీన్ ను.జడ్‌పీహెచ్ఎస్ ఆర్అండ్ఆర్ కాలనీ గజ్వేల్ ప్రధాన కార్యదర్శిగా కె.రాజిరెడ్డి , జడ్‌పీహెచ్ఎస్ చింతమడక, కోశాధికారిగా బి చంద్రశేఖర్, జడ్‌పీహెచ్ఎస్ అంతక్కపేట్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సత్యం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం నిర్వహణలో ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేయడం సరైంది కాదని, మధ్యాహ్న భోజన పథకాన్ని సెంట్రలైజ్డ్ కిచెన్‌కు అప్పగించాలని కోరారు.



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజగంగారెడ్డి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులకు ప్రమోషన్లు ఇప్పించడంలో రాష్ట్ర శాఖ కృషి చేస్తుందని తెలిపారు. అదేవిధంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు కరీముద్దీన్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా శాఖ పట్ల హాజరైన ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం

- రాష్ట్రపతి భవన్లో ఘనంగా సన్మానం

నవతెలంగాణ-మిరుదొడ్డి

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం దక్కింది. మిరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పెద్దిరాజు గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. కళాశాలలో విద్యార్థులకు, సామాజిక అంశాలపై సామాజిక కార్యక్రమాలు, రాజ్యాంగంపై విస్తృత అవగాహనను, కళాశాల అభివృ ద్ధికి దోహదపడే అంశాలపై సెమినార్ నిర్వహించడంతో ప్రభుత్వం పెద్దిరాజు సేవలను గుర్తించి భారత రాజ్యాంగం ఆమోదించబడి నేటికీ 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రపతి భవన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానం చేశారు. రాష్ట్రపతి భవన్ అధికారుల ఆధ్వర్యంలో



ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్ హెచ్ఓడీ కృష్ణకుమార్, హైదరాబాద్ సివిల్ కోర్టు జడ్జ్ సాయికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ అరుదైన గౌరవాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్‌కు దక్కడం, సంతోషకరమని, కళాశాల అధ్యాపక బృందం, జిల్లా, మండల నాయకులు, ఆనందాన్ని వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులుగా మంద పాండు

నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులుగా మంద పాండును నియమిస్తూ బుధవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద పాండు గతంలో స్వచ్ఛందం సేవే కార్యక్రమాలు చేసి ప్రజలతో నిత్యం ఉంటూ, కష్టపడుతూ ప్రజలకు ఏ కష్టం వచ్చినా స్వచ్ఛందంగా సేవలు అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌లో నిత్యం పార్టీ కోసం చురుకుగా పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నందుకు సేవలను గుర్తించి జిల్లా మంత్రి కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్ ,కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ, దుబ్బాక నియోజకవర్గం ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గా నియమించామని తెలిపారు. అనంతరం మంద పాండు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని, భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి మరింత కష్టపడి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.నా సేవలు గుర్తించి నాపై నమ్మకంతో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా



నియమించినందుకు మంత్రి కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, నర్సారెడ్డి, పూజల హరికృష్ణ, ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మధ్యాహ్న భోజన నిర్వహణపై సమీక్ష



నవతెలంగాణ-చేర్యాల

మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాశాఖ అధికారి రచ్చ కిష్టయ్య అధ్యక్షతన మధ్యాహ్న భోజన నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో తహసీల్దార్ మహ్మద్ సమీర్ అమీద్ ఖాన్, మండల పరిషత్ అధికారి మహబూబ్ అలీ, మండల స్పెషల్ ఆఫీసర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంటగది, పరిసరాలు, వంట పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కూరగాయలను శుభ్రంగా కడిగి వంట చేసేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి వాడుకునేలా చూడాలని, మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని, ప్రతి పాఠశాలలో కరివేపాకు మునగ చెట్లను నాటేలా చూడాలన్నారు. పాఠశాలకు అవసరమైన వసతులను గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా కల్పించుకునే విధంగా ఏర్పాటు చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

5

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 28 నవంబర్ 2024 | www.navatelangana.com

గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు భూసేకరణ సర్వే చేసిన అధికారులు



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని తీగలకుంటపల్లి గ్రామంలో గౌరవెల్లి ప్రాజెక్ట్ డీ8 కెనాల్ భూములను బుధవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆర్ఐ సురేందర్ మాట్లాడుతూ భూమి కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బావులు, బోర్‌బావులు, చెట్లు, తదితర వాటికి ప్రత్యేక పరిహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. అలాగే సర్వే చేస్తున్న అధికారులకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

జప్తి సింగాయపల్లిలో పశు వైద్య శిబిరం



నవతెలంగాణ-ములుగు

మండలంలోని జప్తి సింగాయపల్లి గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో భాగంగా పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు, గర్భనిర్ధారణ ఇంజక్షన్, నట్టల నివారణ మందులు, గాలికుంట వ్యాధి టీకాలు వేసినట్లు మండల పశు వైద్య అధికారిని పల్లవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోపాల మిత్ర సేవలను ఉపాయోగించుకొని పశు సంపదను అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్, జెవివో జాజుద్దీన్, ఎస్ ఓ కృష్ణ, గోపాలమిత్ర సూపర్వైసర్ భాస్కర్ గౌడ్, అంజనేయులు, రాజు, పాడి రైతులు పాల్గొన్నారు.


గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక నియోజకవర్గంలోని గర్భిణీ స్త్రీలకు "కత్తి కార్తీక ఫౌండేషన్" ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిట్లను అందజేయడం జరుగుతుందని ఫౌండేషన్ వ్యవసాపకు రాలు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కత్తి కార్తిక గౌడ్ తెలిపారు. తల్లీ బిడ్డలు క్షేమంగా ఉండేందుకు గాను అవసరమయ్యే ప్రోటీన్లు, విటమిలతో కూడిన న్యూట్రిషన్ కిట్లను అందజేశామన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని మల్లాయిపల్లి 1వ వార్డులో గర్భిణీలు బత్తుల శిల్ప, బెల్లె కావ్య, మున్సిపల్ కేంద్రంలోని15 వ వార్డు లో బాసలయకు వార్డు కౌన్సిలర్ పల్లె మీనా రామస్వామి గౌడ్‌తో కలిసి ఈ కిట్లను అందజేశారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ రాములు, నాయకులు చెరుకూరి రాజయ్య, నారాయణరెడ్డి, కామోజీ అనురాధ పలువురున్నారు.

మార్కెట్ కమిటీ బాధ్యతలు చేపట్టిన నూతన కమిటీ



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా కంది తిరుపతిరెడ్డి , వైస్ చైర్మెన్‌గా బంక చందు పాలకవర్గ సభ్యులు బుధవారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. మార్కెట్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేసి చైర్మెన్ సీట్లో కూర్చొని బాధ్యతలు చేపట్టారు. నూతన కమిటీ నియామకం పట్ల మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న మార్కెట్ చైర్మెన్, వైస్ చైర్మన్‌లకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పట్టణంలోని వ్యాపారులు కాంగ్రెస్ కార్యకర్తలు నూతన కమిటీని కలిసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులుగా పన్యాల జనార్ధన్ రెడ్డి




నవతెలంగాణ-తొగుట

జిల్లాలో ఉపాధ్యాయుల ఏలాంటి సమస్యలైన పరిష్క రించేందుకు ముందు వుంటానని పీఆర్టీయు జిల్లా నూతన అధ్యక్షులు పన్యాల జనార్దన్ రెడ్డిని అన్నారు. బుధవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి స్థాపించిన పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పార్వతి సత్యనారా యణ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించామని తెలిపారు. ప్రధాన కార్య దర్శిగా బండి సమ్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా టీ. నాగేశ్వర్లు, డి గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్య దర్శిగా పాకాల మల్లేశం, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులుగా హేమ రాజు, బోడ నరేష్, తోట రమేష్, జిల్లా కార్యదర్శిగా బి. ప్రవీణ్, డి.తిరుపతిలను ఎన్నుకున్నామని తెలిపారు.

సీఎం సహాయ నిధికి నిధులు పెంచండి

-ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

సీఎం సహాయ నిధికి నిధులు పెంచాలని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం శ్రీగిరి పల్లి గ్రామం చెందిన పాండవుల శ్రీకాంత్‌కు రూ.27 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. సీఎం సహాయ నిధి పెంచి పేదలను ఆదుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా అనేక పేదలకు లబ్ధి జరుగుతుందని ప్రభుత్వం గుర్తించాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యతిరేక శక్తులకు రాజ్యాంగం పేరెత్తే అర్హత లేదు




నవతెలంగాణ-నంగునూరు

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక శక్తులకు రాజ్యాంగం పేరెత్తే అర్హత లేదని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధికార ప్రతినిధి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి దేవులపల్లి రాజేందర్ మాదిగ అన్నారు. నంగునూరు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పిన సామాజిక న్యాయం అంటే సమాన పంపిణీ అని వర్గీకరణ వ్యతిరేక శక్తులకు అంబేద్కర్ పేరు ఎత్తే అర్హత లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో 30 ఏండ్లుగా జరుగుతున్న న్యాయమైన ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మాలలు మద్దతు పలికి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని కోరారు. వర్గీకరణను వ్యతిరేకిస్తున్న వారు ఎవరైనా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పనిచేస్తున్న వారే అని స్పష్టం చేశారు. అంతేకాకుండా జనాభా నిష్పత్తి ప్రకారం ఎవరి వాటా వారికి చెందాలని పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం పోరాటం జరుగుతుంటే అది ఏందో సొంత ఆస్తులను గుంజుకున్నట్లుగా వ్యతిరేక శక్తులు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండల అధికార ప్రతినిధి దేవులపల్లి కృష్ణ, మాజీ వార్డు సభ్యులు దేవులపల్లి గణేష్, దేవులపల్లి చింటూ, దేవులపల్లి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి చేయూత

-ఎస్‌ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్



నవతెలంగాణ-రాయపోల్

నిరుపేద యువతీ వివాహానికి మానవత్వంతో చేయూతనివ్వడం జరిగిందని ఎస్‌ఆర్ ఫౌండేషన్ అధ్యక్షు రాలు, సామాజిక ప్రజాసేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామంలో నిరుపేద యువత వివాహానికి బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూరంపల్లి గ్రామానికి చెందిన గంగాధరి స్వరూప- సైదయ్య దంపతులకు ముగ్గురు కూతుర్లు కాగా గతంలో పెద్ద కూతురు వివాహం చేశారు. రెండో కూతురు స్వాతి వివాహం చేయడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని మా దృష్టికి రాగా మా వంతు సహకారంగా ఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాతి వివాహానికి 50 కిలోల బియ్యం అందజేశామన్నారు. ఇంకా ఎవరైనా మానవతావాదులు వీరి వివాహానికి సహాయం చేసి ఆడబిడ్డ పెళ్లి ఘనంగా జరగడానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఏ కులాల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల నర్సింలు,ఎస్‌ఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జర్నలిస్ట్ పుట్ట రాజు, స్వాతి, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం

- కొడకండ్ల స్కూల్ వద్ద ఇటుక లారీ బోల్తా
- స్కూలుకు వెళుతున్న విద్యార్థుల పక్కనే బోల్తా పడ్డ లారీ
- ముగ్గురు విద్యార్థులకు గాయాలు.





నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

అతివేగంగా అజాగ్రత్తగా వస్తున్న ఇటుకుల లారీ బోల్తా కొట్టింది. ఈ సంఘటన గజ్వేల్ మండలం కొడకండ్ల ప్రభుత్వం స్కూల్ వద్ద బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కుకునూరుపల్లి వైపు నుంచి ఇటుకల లోడుతో పెద్ద లారీ ప్రజ్ఞాపూర్ వైపు వెళుతుంది. అదే సమయంలో కొడకండ్ల గ్రామ ప్రభుత్వ స్కూల్ వద్దకు రాగానే అదుపుతప్పి పక్కనే ఉన్న ఇంటి పక్కకు దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఆ సమయంలో అక్కడి నుండే స్కూల్‌కి వెళ్తున్న విద్యార్థులు ఒక్కసారిగా పరుగులు తీశారు. లారీ తమ మీదికి వచ్చి పడుతుందేమోనని ఒక్కసారిగా దౌడు మొదలెట్టారు. ఆ సమయంలో జస్వంత్, మణిదీప్, అఖిలేష్, కరుణశ్రీ లకు గాయాలయ్యాయి. పక్కనే మేకల మంద ఉంది. వాటిపై ఇటుకలు పడడంతో మేకలు అక్కడి నుంచి వెళ్ళిపోయాయి. ఏది ఏమైనా తృటిలో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న స్కూల్ హెచ్‌ఎం మధునాల శ్రీనివాస్ ఇలాంటి ప్రమాదాలు జరుగుతాయని ముందే పసిగట్టాడు. గత రెండు నెలల క్రితం గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాసులను విద్యార్థులతో సహా కలిశాడు. వెంటనే కొడకండ్ల గ్రామం వద్ద సూచిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు స్కూలుకు వచ్చే సమయంలో రోడ్డు దాటడం ఇబ్బందిగా మారుతుందని పేర్కొన్నారు. రెండు నెలలు గడుస్తున్న అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని దాటాల్సి వస్తుందని బోరుమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పోలీసులు చొరవ తీసుకొని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అసాంఘిక కార్యక్రమాలు నిరోధించేందుకు సీసీ కెమెరాలు దోహదం



నవతెలంగాణ-తొగుట

అసాంఘిక, అనైతిక కార్యక్రమాలకు నిరోధించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని మిరుదొడ్డి ఎస్సై పరశురాములు అన్నారు. బుధవారం మండలంలోని గుడి కందుల ఉన్నత పాఠశాలలో ఎన్ఫోర్స్మెంట్ సబ్ ఇన్స్పెక్టర్ అంబిగల్ల సాయి ప్రసాద్ అందించిన 4 సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో ఎలాంటి అసాంఘిక, అనైతిక కార్యక్రమాలకు పాల్పడ్డా వాటిని నిరోధించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. పాఠశాలలో పూల, క్రోటన్ మొక్కలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయని కొనియాడారు. విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఎస్సై పరశురాం, తొగుట మండల విద్యాధికారి వడ్లకొండ నరసయ్య, దాత సాయి ప్రసాదును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరపాటకం అంజిరెడ్డి, ఉపాధ్యాయులు సోమగారి నాగిరెడ్డి, వేణుమాధవ్, హనుమా రెడ్డి, కనక రాములు ,రవీందర్ రెడ్డి, శివయ్య, భాస్కర్ రెడ్డి, పర్వేజ్, బండారి లావణ్య, అనసూయ సీఆర్పీ వెంకటస్వామి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న అక్కన్నపేట

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య



నవతెలంగాణ-అక్కన్నపేట

హుస్నాబాద్ నియోజకవర్గంలోనే అక్కన్నపేట మండలం అభివృద్ధిలో దూసుకుపోతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కన్నపేట మండల అభివృద్ధికి బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ నిధులు మంజూరు చేశారన్నారు. అక్కన్నపేటలో అంగన్వాడీ భవనానికి రూ.8 లక్షలు, అంతక పేట సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు, బొడిగపల్లె సీసీ రోడ్లకు రూ.10 లక్షలు, గొల్లపల్లి సీసీ రోడ్లకు రూ.10 లక్షలు, మైసమ్మ తండాకు సీసీ రోడ్లకు రూ.12లక్షలు, మంచినీళ్ల బండ తండా సీసీ రోడ్లకు రూ. 5 లక్షలు మల్చేరుతండా సీసీ రోడ్లకు రూ.5 లక్షలు, పెద్ద తండా రూ.5 లక్షలు, రేగొండ గ్రామానికి సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు, కేశవాపూర్ సీసీ రోడ్లకు రూ.5 లక్షలు, కుందన్ వానిపల్లికి రూ.5 లక్షలు, గుబ్బడికి రూ.10 లక్షలు, పోతారం (జె)కు రూ.10 లక్షల చొప్పున గ్రామాల అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ నిధులు మంజూరు చేయడంపై ఐలయ్య హర్షం వ్యక్తం చేశారు.

పట్టు పురుగులకు రోగాలకు ముందు జాగ్రత్తలు

- ఏ.డీ ఇంద్రసేనారెడ్డి



నవతెలంగాణ - చిన్నకోడూరు

పట్టు పురుగులు పెంచే రైతులు వాటికి రోగాలు రాకుండా ముందే జాగ్రత్తలు తీసుకుంటే పంట దిగుబడి అధికంగా వస్తుందని పట్టు పరిశ్రమ శాఖ సిద్దిపేట జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం రైతు దినోత్సవం సందర్భంగా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామంలోని పెద్దోళ్ల నరసింహులు వ్యవసాయ క్షేత్రం వద్ద ములుగు పట్టు పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలోని పట్టు రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పట్టు పురుగులకు రోగాలు రాకుండా నాణ్యమైన ఆకును అందివ్వాలని తెలిపారు. మల్బరీ తోటలకు పచ్చిరొట్ట, పశువుల పేడ తదితర సేంద్రియ ఎరువులను వేయడం వల్ల ఆకు నాణ్యతగా వస్తుందన్నారు. పట్టు పురుగుల షెడ్‌లో పురుగులకు అవసరమైన ఉష్ణోగ్రత ఉంచాలని, వాటికి పెంపకానికి సరిపోయేంత స్థలం కేటాయించాలని, రోగాల నివారణకు విజేత, బ్లీచింగ్ పౌడర్, సున్నం, అస్త్ర, ఫార్మలిన్ వంటి మందులను అధికారులు సూచించిన మోతాదులోనే వాడాలని తెలిపారు. ప్రముఖ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వినోద్ కుమార్, సెంట్రల్ సిల్క్ బోర్డు టెక్నికల్ అధికారి డాక్టర్ రాఘవేందర్‌లు మాట్లాడుతూ పాల పురుగు, సున్నం కట్టు రోగం, నాన్ స్పిన్నింగ్ తదితర రోగాలు రాకుండా ఎలాంటి మందులు వాడాలో వివరించారు. మల్బరీ తోటకు ఎరువులు ఏవేవి ఏ మోతాదులో వాడాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమ అధికారి శర్మ, మల్లేశం, జిల్లా పట్టు రైతుల సంఘం అధ్యక్షులు పెద్ద ఐలయ్య, గౌరవ అధ్యక్షులు పెద్దోళ్ల నరసింహులు, రంగదాసు, బి. నర్సింలు, పిల్లి శీను, బి. మహేష్, రామచంద్రం, యాదగిరి, జిల్లాలోని వివిధ ప్రాంతాల పట్టు రైతులు పాల్గొన్నారు.

గంజాయి నిందితులు అరెస్టు

- 10 కిలోల గంజాయి,1 సెల్ ఫోన్ రికవరీ
- ఏసీపీ పురుషోత్తం రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

అత్యాధునిక టెక్నాలజీతో ఎలాంటి నిందితులైన పోలీస్ నిఘాతో పట్టుకోవడం జరుగుతుందని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి అన్నారు. బుధవారం గంజాయి క్రయవిక్రయాలు చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అనంతరం గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో ఏసీపీ మాట్లాడుతూ చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు, గజ్వేల్ పోలీసులు నిఘా పెట్టి టెక్నాలజీతో చాకచక్యంగా గంజాయి అమ్ముతున్న నిందితులను పట్టుకున్నారన్నారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన అరికెల శేఖర్, సుక్కసారి భాను ప్రసాద్, బోయిని నరేష్, ముగ్గురు కలిసి చెడు అలవాట్లకు బానిసయ్యారని పేర్కొన్నారు. గంజాయి అమ్మి డబ్బులు సంపాదిద్దామని నిర్ణయించుకొని సిద్దిపేట పరిసర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారన్నారు. బైకులు, మోటార్ సైకిల్ పై సీలేరుకు వెళ్ళి గతంలో 2, 3 సార్లు గంజాయి గజ్వేల్‌కి తీసుకువచ్చారన్నారు. గత ఎనిమిది నెలల క్రితం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అమ్మడానికి వెళ్లచుండగా పోలీసులు పట్టుకొన్నామన్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపిరన్నారు. బెయిల్ పై జైలు నుంచి బయటకు వచ్చిరన్నారు.గత వారం రోజుల క్రితం శేఖర్, నరేష్, గంజాయి తీసుకుని రావడానికి సీలేరు వెళ్తున్నామని వారి స్నేహితుడు భాను ప్రకాషకు ఫోన్ చేశారన్నారు. నాకు పని ఉంది నేను రాను నాకు గంజాయి కావాలని రూ. 7 వేలు శేఖర్‌కు ఫోన్ పే చేసారని ఒప్పుకోన్నారు. నరేష్ స్నేహితుడు చింటు బైకు తీసుకొని అరికెల శేఖర్, బోయిని నరేష్ ఇద్దరు భద్రాచలం సీలేరుకు వెళ్లారని పేర్కొన్నారు. వర్ధన్ అనే వ్యక్తికి రూ. 30వేల 800 వందలకు ఇచ్చి, 20 కిలోల గంజాయి కొనుగోలు చేశారన్నారు. అరికెల శేఖర్ ఒక బ్యాగులో 10 కిలోల గంజాయి పెట్టుకుని అక్కడి నుంచి హైదరాబాద్ వరకు బస్సులో వచ్చి అక్కడి నుంచి ఊరికి వచ్చి ఊరు బయట గ్రామ శివారు మల్లన్న సాగర్ కట్ట వద్ద దాచి పెట్టడని అంగీకరించారన్నారు. గంజాయి కావాలని భాను ప్రసాద్ రాగానే అందులో నుంచి అతనికి 2 కిలోల గంజాయి ఇచ్చాడని తెలిపారు. నిందితుల వద్ద నుంచి 10 కిలోల గంజాయి, 1 సెల్ ఫోన్లు, రికవరీ చేశామన్నారు. ఇద్దరు నిందితులను గజ్వేల్ అడిషనల్ సీఐ ముత్యం రాజు అరెస్టు చేసి జ్యుడిషయల్ రిమాండ్‌కు పంపించారన్నారు. కేసు పరిశోధన కొనసాగుతుందని, త్వరలో పరారీలో ఉన్న నరేష్, వర్ధన్ ఇద్దరు నిందితులను పట్టుకొని అరెస్టు చేస్తామని తెలిపారు. చాకచక్యంగా గంజాయిని పట్టుకున్న టాస్క్ ఫోర్స్ ఏసీపీ రవీందర్,సిఐ జానకి రామ్ రెడ్డి, రమేష్, సిబ్బంది, గజ్వేల్ సీఐ లు సైదా, ముత్యం రాజు, సిబ్బందిని, పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ అభినందించారని పేర్కొన్నారు. త్వరలో రివార్డ్ అందజేయడం జరుగుతుందని తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- 25మందికి రూ.15 వేలు జరిమానా
- గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. బుధవారం మద్యం సేవించి వాహనాలు నడిపిన 25 మందికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికమయ్యాయన్నారు. గజ్వేల్ ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 25 మందికి, రూ.15 వేల జరిమానా విధించిందిచమన్నారు. సిబ్బందితో గత కొన్ని రోజుల గజ్వేల్ పట్టణంలో పిడిచెడ్, క్యాసారం ఎక్స్ రోడ్, తూప్రాన్ రోడ్, ముట్రాజ్ పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ నిర్వహించమన్నారు. 33 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా బ్రీత్ ఎనలైజర్‌తో నిర్ధారణ చేశామన్నారు. గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ముందు హాజరుపరచగా విచారణ చేసి జరిమాన విధించారన్నారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా సీఎం క్రికెట్ కప్పు టోర్నీ




నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలో జరుగుతున్న సీఎం రేవంత్ రెడ్డి క్రికెట్ కప్పు టోర్నమెంట్ పోటీలు రసంతరంగా జరుగుతున్నాయి. నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తడకపల్లి, గోనపల్లి మధ్య జరిగిన మ్యాచ్‌లో తడకపల్లి విజయం సాధించిందని, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ సాయికిరణ్ నిలిచాడని తెలిపారు. చైతన్య టీం, వైఎల్ఆర్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వైఎల్ఆర్ టీం గెలపొందిందని, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సాయి నిలిచాడని తెలిపారు. బూరుగుపల్లి, చిన్నకోడూరుల మధ్య జరిగిన మ్యాచ్‌లో చిన్నకోడూరు విజయం సాధించిందని, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రాజు నిలిచినట్లు తెలిపారు. రేణుకా మాత యూత్, ఫ్రెండ్స్ టీంల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఫ్రెండ్స్ టీం గెలుపొందిందని తెలిపారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ సాయి కుమార్ యాదవ్ నిలిచినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చెంది రెడ్డి అంజి రెడ్డి, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు చెంది రెడ్డి నరేందర్ రెడ్డిలతో కలిసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను శ్రీనివాస్ రెడ్డి అందజేశారు.

ఏడీ రాందాస్‌ను సస్పెండ్ చేయాలి

- ట్రాన్స్కో రూరల్ జోన్ ఈసీకి యూఈఈయూ ఆధ్వర్యంలో వినతి పత్రం



నవతెలంగాణ-సిద్దిపేట

సేఫ్టి ప్రికాషన్స్ కరెక్ట్‌గా పాటించకుండా, పర్యవేక్షణ అధికారి నిర్లక్ష్యంగా ఉండడం వలన ప్రమాదం జరిగిందని, ఏడీ రాందాస్‌ను సస్పెండ్ చేయాలని ఈసీని కోరడం జరిగిందని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యూఈఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్ తెలిపారు. బుధవారం యూఈఈయూ సిద్దిపేట సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ట్రాన్స్కో రూరల్ జోన్ ఈసీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమకుల సబ్ స్టేషన్‌లో జరిగిన సంఘటనపై బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని, ఏడీ రాందాస్‌ను సస్పెండ్ చేయాలని, ఈసీతో సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు. అదేవిధంగా గతంలో ఏడీ రామదాసు అనేక అక్రమాలకు పాల్పడ్డాడు, అక్రమాలు అన్నిటిని కూడా ఎంక్వయిరీ చేసి అతనిపై చర్యలు తీసుకోవాలని, డిపార్ట్మెంట్ పరంగా కూడా యాక్షన్ తీసుకోవాలని, డిపార్ట్మెంట్ వాడుకున్నటువంటి సొమ్ములు అన్నిటిని కూడా డిపార్ట్మెంట్ పరికరాలను డిపార్ట్మెంట్ ఎక్యుమెంట్ అన్నిటిని కూడా తన సొంత ప్రయోజనాలకు వాడుకున్నడన్నారు. కార్మికులను కూడా బానిసలుగా తన ఇంట్లో పని చేయించుకున్నాడని, కాబట్టి వీటినన్నిటిమీద విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందిం చి తగు చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షులు సింగిరెడ్డి చంద్ర రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుంటిపల్లి సదాకర్, నాయకులు కనకరాజు, సుధాకర్, విష్ణు పాల్గొన్నారు.

పాఠశాల వేదికను ప్రారంభించిన ఎమ్మెల్సీ అభ్యర్థి



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తన తండ్రి వంగ సత్తి రెడ్డి జ్ఞాపకార్థం పాఠశాల వేదిక ఏర్పాటుకు సుమారు రూ.లక్షల 50 వేలు అందించి, నేడు ప్రారంభించడం సంతోషంగా ఉందని పీఆర్టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం వేదికను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్ మాట్లాడుతూ పాఠశాలకు చాలా ఉపయోగకరమైన వేదికను ఏర్పాటు చేసిన మహేందర్ రెడ్డికి పాఠశాల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామని, విద్యాభివృద్ధికి కృషి చేసిన ఆయన మున్ముందు కూడా వీఎంఆర్ ఫౌండేషన్ ద్వారా పాఠశాలలో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మహేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రెటరీ ఉదయశ్రీ, ఫిజికల్ డైరెక్టర్ సుజాత, ఉపాధ్యాయులు బాల సరస్వతి, కోట ప్రభు, అశోక్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, అంజిరెడ్డి, అరుణ బాయి, సిద్ధేశ్వర్, సంతోష్, శ్రీలత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో కానరాని అభివృద్ధి

- పశ్చాత్తాప పడుతున్న ప్రజలు
- అన్నమో రామచంద్ర అంటున్న వ్యాపారులు
- సీఎంగా కేసీఆర్ రావాలి అంటున్న ప్రజలు
- అప్పుడే బాగుండే ఇదేం పరిస్థితి ఇప్పుడు
- మూడో వార్డు కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మి కనకయ్య ముదిరాజ్





నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి అభివృద్ధిని మొత్తం కతం చేసింది. ఎక్కడ చూసినా ఏ అభివృద్ధి పని జరగక గోడుమంటున్న గజ్వేల్ పట్టణం. మూగబోయిన గజ్వేల్ అభివృద్ధికి పూర్వ వైభవం వచ్చేదేప్పుడు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎక్కడ చూసిన అభివృద్ధి దండిగా నిధులు ఉండేవి. 11 నెలలుగా ఎలాంటి అభివృద్ధి లేదు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కనుమరుగు అవుతుందా అన్న పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ పేద బడుగు బలహీన వర్గాల పార్టీ అని నమ్మిన ప్రజలు ఇప్పుడు మోసపోయారు. అంటూ ప్రజల నుంచి తనకు వచ్చిన అభిప్రాయాలను గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని మూడో వార్డు కౌన్సిలర్ మార్కంటి వరలక్ష్మి కనకయ్య ముదిరాజ్ నవ తెలంగాణతో వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన ఎలాంటి కరువు రాలేదన్నారు. గ్రామ గ్రామానికి కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ కు దక్కుతుందన్నారు. కుటుంబ పెద్దగా రాష్ట్రాన్ని పాలించిన మాజీ సీఎం అనునిత్యం ప్రజల కోసమే పనిచేశారన్నారు. అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారని నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతిఫలాలను రాష్ట్రానికి అందించారన్నారు. దేశానికే తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలపాలన్న ఆయన ఆశయాన్ని రాష్ట్ర ప్రజలు విస్మరించారన్నారు. పదేపదే తెలంగాణ అన్యాయానికి గురి కావద్దని ఎంత చెప్పినా వినకుండా కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు ఓటేశారన్నారు. మసిపూసి మారేడు కాయ చేసిన కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మిన రాష్ట్ర ప్రజలు ఇప్పుడు మళ్లీ కేసీఆర్ సీఎంగా రావాలని కోరుకుంటున్నారన్నారు. ఆరు గ్యారెంటీ లంటూ గారడీ చేసిన ప్రస్తుత రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఎలా న్యాయం చేస్తారో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రజల అవసరాలను తీర్చలేని సీఎం ఎలాంటి దస్త్రాలపై సంతకం పెట్టాలన్న ఢిల్లీ పెద్దల ఆదేశాలు కావాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను గజ్వేల్ నుంచి ఇతర జిల్లాలకు తరలించడంపై ఆంతర్యమేంటని ప్రశ్నించారు. గజ్వేల్‌లో చేసేందుకు పనులు లేవా..? కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపిస్తలేవా..? అని ప్రశ్నించారు. ఏకపక్షం లేకుండా అన్ని వర్గాల వారికి సమన్యాయం చేయాలన్నదే బీఆర్ఎస్ ధ్యేయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందు వరకు మూడో వార్డులో ప్రతి అభివృద్ధి పనికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. సంవత్సర కాలం పాటు ఒక్క రూపాయి అయినా నిధులు మంజూరు చేయని ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చిరు వ్యాపారులు ఎలా జీవించాలో తెలియక కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఎటు చూసినా నిర్లక్ష్యం, ఆలస్యం, అశ్రద్ధ, అన్యాయం, రాజ్యమేలు తున్నాయన్నారు. ప్రభుత్వం ప్రజా పాలన అంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఇలా అయితే ఇంకా నాలుగేళ్ల బ్రతికేది ఎలా అని ప్రజల నుంచి వ్యక్తం అవుతున్న అభిప్రాయము అని తెలిపారు.

ప్రజాసంక్షేమంపై దృష్టి పెట్టండి



-ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

ప్రజా సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ప్రతిపక్షాలపై విమర్శలు మార్చుకొని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఇంటిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన వచ్చి ఏడాదికస్తున్న ఇచ్చిన ఆరు గ్యారెంటీలో బస్సు ప్రయాణం మినహా మిగతా వాటి విషయంలో దృష్టి పెట్టలేకపోతుందన్నారు. అంతేకాకుండా వృద్ధులకు, వికలాంగులకు, వితంతులకు పెంచుతని పింఛన్ ఇప్పటివరకు పెంచకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వచ్చే శీతాకాల సమావేశాల్లో వీటిపై చర్చిస్తామని చెప్పారు. అంతేకాకుండా ఉచిత 200 యూనిట్ల విద్యుత్తు కొందరికే పరిమితమైందన్నారు. గ్యాస్ సైతం కొందరికి పరిమితమైందని ఆయన పేర్కొన్నారు. రైతులకు రైతుబంధు, రైతు భరోసా, రైతు బీమా తదితర పథకాలను అమలు చేయడం లేదన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో అనేక పెండింగ్ పనులు ఉన్నాయని వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులను గజ్వేల్ నియోజకవర్గంలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. శాసనసభలో అనేక సమస్యలపై చర్చిస్తామన్నారు.

మున్సిపల్ అభివృద్ధిపై దృష్టి పెట్టింది

-గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి పెట్టిందని పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం జనవరి 23తో ముగుస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధినేత సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టితో మున్సిపల్ అభివృద్ధి జరుగుతుందని, ఆయన నాయకత్వంలో అన్ని మున్సిపల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తుందని పేర్కొన్నారు. జిల్లా మంత్రులు ప్రత్యేక దృష్టి పెట్టవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. అభివృద్ధి ప్రధానంగా ముందుకు వెళు న్నామని సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. గత ఏడాది కింద అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు తెప్పించుకొని దృష్టి పెట్టిందని అన్నారు. జిల్లా మంత్రుల నాయకత్వంలో అభివృద్ధి చేపడుతున్నట్లు అన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ- రాయపోల్



క్షేత్రస్థాయిలో వివిధ పంటలను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలు సూచించామని, అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలించామని దౌల్తాబాద్ మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ అన్నారు. ముబారస్ పూర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం, వివిధ రైతుల పంట క్షేత్రాలను సందర్శించి రైతులకు తగు సూచనలు చేశారు. మొక్కజొన్న విత్తిన వెంటనే వారం రోజుల లోపు వేప నూనె పిచికారీ చేస్తే కత్తెర పురుగు రాకుండా ముందస్తుగా నివారించవచ్చు. 20 నుంచి 25 రోజుల లోపు మొక్కజొన్నలో పురుగు గమనించినట్లయితే ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు, వేప నూనె కలిపి పిచికారి చేయాలి. కత్తెర పురుగు ముందస్తు నివారణకు లైట్ ట్రాప్ అనగా రాత్రిపూట మొక్కజొన్న క్షేత్రాలలో ఓ బల్బు అమర్చడం ద్వారా లెక్కల పురుగును నివారణ చేయవచ్చు. కత్తెర పురుగుకు సంబంధించిన రెక్కల పురుగును లింగాకర్షణ బుట్టల ద్వారా కూడా నివారించవచ్చు. అదేవిధంగా వరి కోత కోసిన రైతులు వరి కొయ్యలు కాల్చకుండా వాటిని 50 కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్, 10 నుంచి 15 కిలోల యూరియా మిశ్రమం ముందుగా పొలాల్లో చల్లి నీటిని విడుదల చేసి కొయ్యలను కుళ్లింపజేయాలి. దీని ద్వారా వాతావరణ కాలుష్యం నివారించవచ్చు.కొత్తగా ఆయిల్ పామ్ చేయడానికి రైతులను ఆయిల్ ఫాం సాగు విధానము, లాభాల గురించి వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముబారస్ పూర్ ఏఈవో శిరీష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బురుగుపల్లిలో అంతా అసంపూర్తి పనులు

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం బురుగుపల్లి గ్రామంలో ఐదేండ్లుగా జరిగిన అభివృద్ధి ఏమి లేదని బీజేపీ నాయకులు వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం బూరుగుపల్లి గ్రామంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు ఇబ్బందిగా మారిన పనులను గత ప్రభుత్వం పూర్తి చేయలేక పోయిందన్నారు. బురుగుపల్లి నుంచి తిప్పారం వెళ్లే బ్రిడ్జి పూర్తికాక పొలంతో రైతులు తన ధాన్యాన్ని తీసుకుపోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగానే రైతులు ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని ఆయన ఆవేదన చెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. బురుగుపల్లి నుంచి తిప్పారం వెళ్లే బ్రిడ్జిని పూర్తి చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటరామిరెడ్డి, మహేందర్, అరవిందు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం

నవతెలంగాణ- రాయపోల్

ఆయిల్ ఫామ్ పంటసాగుతో రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ఆంజనేయులు, ఏఈఓ సునంద, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగు పై రైతులకు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో ఆయిల్ పామ్ పంటలు, వడ్డేపల్లిలో డ్రాగన్ ఫ్రూట్ పంటలను జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వేరువేరుగా మాట్లాడుతూ కొత్తగా ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తారని, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం సబ్సిడీ డ్రిప్ మొక్కలకి ఇస్తారన్నారు. రైతులందరూ ఆయిల్ ఫామ్ సాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చు. ఫామాయిల్ చెట్లు నాటిన 14 నెలలకు పూత ప్రారంభమవుతుంది. మొక్క 30 నేలలు వయసు వచ్చేవరకు లేత దశలో మగ ఆడ పుష్పాలన తప్పనిసరిగా తొలగించాలి.తద్వారా చెట్టు యొక్క మాను (మొదలు భాగం) బాగా ఊరుతుంది. తద్వారా 36 నెలల వయసులో గెలల బరువు బాగా వస్తుంది. ఎకరానికి నికరంగా ప్రతి సంవత్సరం 10 టన్నుల పామాయిల్ దిగుబడిని పొందవచ్చు. ఐదేండ్ల తర్వాత ఆయిల్ ఫామ్ లో కోకో పంట కూడా వేసుకోవచ్చు. దీనివలన అధిక లాభాలు నికరంగా ఎకరానికి లక్ష వరకు ఆదాయం పొందవచ్చు. తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలోనే మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాము. గేలలు ఫ్యాక్టరీకి సరఫరా చేసిన మూడు రోజుల్లో నగదు రైతు ఖాతాల్లో జమవుతుంది.2025 జూన్ నాటికి నంగునూరు మండలంలో ఫ్యాక్టరీ అందుబాటులోకి రానుంది. సిద్దిపేట జిల్లాలో ఇప్పటివరకు 11 వేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగులో ఉంది. ఆయిల్ ఫామ్ తోటలో మూడు సంవత్సరాల వరకు అంతర పంటలుగా మొక్కజొన్న, వేరుసెనగ, పప్పు, ధనియాల వంటి అనేక పంటలు సాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చని రైతులకు వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలోఉద్యానవన శాఖ అధికారి రమేష్, ఫీల్డ్ ఆఫీసర్ ఆంజనేయులు, ఏఈఓ మధులిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

ఆయిల్ పామ్ పంటలపై రైతులు దృష్టి సారించి ఆర్థికంగా సామాజికంగా బలోపేతం కావాలని వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. బుధవారం గజ్వేల్ మండలంలోని బెజగామ గ్రామంలో ఉద్యాన శాఖ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్ అగ్రికల్చర్ ఆఫీసర్ నాగరాజు, ఉద్యాన శాఖ అధికారి సౌమ్య మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు విశిష్టత ప్రాముఖ్యత యాజమాన్య పద్ధతులు ఉద్యాన శాఖ ద్వారా అందించే రాయితీ వివరాలను రైతులకు క్లుప్తంగా వివరించారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ మిగతా అన్ని రకాల పంటలతో పోలిస్తే పామాయిల్ పంట రైతులకు అనేక ప్రయోజనాలను చేకూర్చుతుందన్నారు. ఆయిల్ పంట పైన ఆసక్తి ఉన్న రైతులు తమకు దగ్గరలో సంబధిత అధికారులకు వారి దరఖాస్తులను అందించవలసిందిగా కోరారు. అలాంటి రైతులను అశ్వరావుపేట రైతు క్షేత్రంకు సందర్శనంకు తీసుకెళ్లి వివరిస్తారు. మొదటి మూడు ఏండ్ల వరకు అంతర పంటల ద్వారా, పంటలో ఎటువంటి చీడపీడల బెడద ఉండకపోవడం వలన రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి నికర ఆదాయం పెరుగుతుందన్నారు. ఉద్యాన శాఖ ద్వారా మొక్కలకు, డ్రిప్పు పరికరాలకు నాలుగేండ్ల యాజమాన్యానికి రాయితీ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక క్లస్టర్ ఏఈఓ మాధవి ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, రైతులు శివారెడ్డి, నారాయణ రెడ్డి, సుదర్శన్ రెడ్డి,సత్యనారాయణ, నాంపల్లి బాబు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

- నిధులు మంజూరు పట్ల హర్షం
- మండల పరిషత్ ఏర్పాటు ప్రకటనపై కాంగ్రెస్ సంబరాలు



నవతెలంగాణ-మద్దూరు

నూతనంగా మండలాలుగా ఏర్పడ్డ మండలాల్లో మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం జీవో జారీ చేయడంతో దూల్మిట్ట, మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అధ్యక్షులు చెట్కూరి కమలాకర్ యాదవ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడ్డ దూల్మిట్ట, మండలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ కార్యాలయాన్ని మాత్రమే ఏర్పాటు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూతనంగా ఏర్పడ్డ మండలాలకు రానున్న జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండల పరిషత్ కార్యాలను మంజూరు చేసిందన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఏర్పాటుకు సహకరించిన సీఎంకి, డీసీసీ అధ్యక్షులకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బైరాన్ పల్లి మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుబ్బాక

నూతనంగా నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్లకు రూ.10 లక్షలు మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం దుబ్బాక మండల పరిధిలోని హబ్సిపూర్ గ్రామంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు మల్లి కనకరాజు, నర్సగల్ల బాబు ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని, గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ సర్కార్ తోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డి,ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు జోగు పోశయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఏర్పుల దుర్గయ్య, యూత్ అధ్యక్షుడు కొక్కడగల్లరమేష్, బూత్ అధ్యక్షులు బాబు, స్వామి, కార్యదర్శి నర్సగళ్ల సందీప్, మల్లి స్వామి, నర్సగల్ల భాస్కర్, జోగు చంద్రం, మాజీ సర్పంచ్ ఆస్క శ్రీనివాస్ ఉన్నారు.

నవతెలంగాణ-కొండపాక

నూతనంగా ఏర్పడిన కుకునూరుపల్లి మండల పరిషత్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రకటించడంతో కాంగ్రెస్ మండల అధ్యక్షులు విరుపాక శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కుకునూరుపల్లిలో బుధవారం సంబరాలు నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-రాయపోల్



అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇటీవల మేనమామ ఆత్మహత్య తీవ్రంగా కలిచి వేయడంతో యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం సాయంత్రం దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. దౌల్తాబాద్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సూరంపల్లి గ్రామానికి చెందిన వడ్డే ఉపేందర్ (23) స్పందన ప్రైవేట్ ఫైనాన్స్‌లో పని చేస్తుంటాడు. ఇటీవల వారం రోజుల నుంచి అనారోగ్యానికి గురైతే గజ్వేల్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. అలాగే ఉపేందర్ మేనమామ మల్లేష్ 12 రోజుల క్రితం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన అనారోగ్య సమస్యలు, మేనమామ మృతి జీర్ణించుకోలేక జీవితం పై విరక్తి చెంది ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఉపేందర్ మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి వడ్డే స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ తెలిపారు.

పూర్తి మండలం ఏర్పాటు చేయడం పట్ల హర్షం

నవతెలంగాణ-మిరుదొడ్డి

అక్బర్ పేట-భూంపల్లి మండలంను పూర్తిస్థాయి మండలంగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండ సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు అక్బర్ పేట-భూంపల్లి మండలం ప్రజలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట స్వామి గౌడ్ మాట్లాడుతూ అక్బర్ పేట-భూంపల్లి మండలానికి మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని జీవో నెంబర్ 67 ద్వారా ప్రత్యేకమైన ఏర్పాటు చేయడం జరిగిన సంతోషకరమన్నారు. గతంలో బీఆర్ఎస్ మూడేండ్లలో కేవలం కేవలం అక్బర్ పేట-భూంపల్లి మండలానికి ఎమ్మార్వో ఆఫీసు కార్యాలయాన్ని ఏర్పాటు చేసి చేతులు ఎత్తేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండల వ్యవసాయ అధికారిని నియమించడం జరిగిందని, అలాగే మండల విద్యాధికారిని నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కోణపురం బాలు యాదవ్, బేగంపేట తాజా మాజీ సర్పంచ్ అనసూయ ప్రతాప్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొమ్మెర శ్రీధర్, కోరంధ రవీందర్ రెడ్డి, బత్తే వెంకటేశం, పాతూరి శ్రీనివాస్ గౌడ్, పోతారం ముత్యాలు, మహమ్మద్ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

లోక కళ్యాణార్థం చండీయాగం నిర్వహించిన ఎమ్మెల్సీ

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

లోక కళ్యాణార్థం ఎమ్మెల్సీ షేర్ సుభాష్ రెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో చండీయాగం నిర్వహించారని రంగంపేట పీఠాధిపతి శ్రీ శ్రీ మాధవానంద స్వామి సరస్వతి తెలిపారు. మండల పరిధిలోని కూచన్ పల్లి గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో ఎమ్మెల్సీ షేర్ సుభాష్ రెడ్డి బుధవారం వేద పండితుల ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి శ్రీశ్రీ మాధవనంద స్వామి సరస్వతి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులనుద్దేశించి ప్రవచనాన్ని అందించారు. గతంలో లోకకళ్యాణార్థం సహస్ర యాగం, సుదర్శన యాగాలను ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి దంపతులు నిర్వహించారని గుర్తు చేశారు. శ్రీరాముడు అనుసరించిన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని చండీయాగం నిర్వహిస్తున్నారని స్వామి తెలిపారు. శంకరునికి ప్రీతి మాసం కార్తీక మాసమన్నారు. ఈ



కార్యక్రమంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ నారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మండలంలోని మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు , కౌన్సిలర్‌లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.